PRGI Reg No -"APTEL/26/A1193
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...


ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 220, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 30 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-



# ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం. మిగతా 2 లో

- ఆరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ సంస్థ
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల వేళ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడి

# అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు

## విజయవాడలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్

- ★ ఉద్యోగుల సామర్థ్య పెంపులో ఏపీకి జాతీయ స్థాయిలో తొలి ర్యాంక్
- ★ విజేతలకు అవార్డులు అందజేసి ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- ★ సాంకేతికత, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న సీఎం
- ★ రెండో స్థానంలో కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా




అమరావతి: అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్లు పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్లు పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్లు చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా 2 లో

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు మంత్రి పొన్నం ప్రభాకర్



- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మిగతా 2 లో



# యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!

- క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు
- ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు
- యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం
- డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి
- సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక

ఢిల్లీ: యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం



# భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం.. పట్టాలెక్కిన తొలి ఎల్‌ఎన్‌జీ రైలు.. దీని ప్రత్యేకత ఏంటంటే?

- భారతదేశపు తొలి ఎల్‌ఎన్‌జీ ఆధారిత రైలు సేవలు ప్రారంభం
- అహ్మదాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం దీని ప్రత్యేకత
- డీజిల్‌తో పాటు ఎల్‌ఎన్‌జీ వాడకంతో 40శాతం ఇంధనం ఆదా అంచనా
- హైడ్రోజన్ రైలుకు భిన్నమైన టెక్నాలజీతో ఈ రైలు రూపకల్పన

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది



- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల

# రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో పల్లె పండుగ 3.0' ప్రారంభం

## పాడి రైతుల కోసం మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు, ఉద్యానవనాల ఏర్పాటు

- ★ గ్రామసీమల అభివృద్ధికి 'పల్లె పండుగ 3.0'.. రామాపురంలో లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్
- ★ నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శ్రీకారం
- ★ 15,500 కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.10,250 కోట్లు కేటాయింపు
- ★ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమన్న ప్రభుత్వం




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ. 11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మిగతా 2 లో



# స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు.. ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన

- స్థానిక ఎన్నికల షెడ్యూల్ మరో 2 నెలలు ఆలస్యమంటూ వదంతులు
- ఈ ప్రచారాన్ని కొట్టిపారేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అధికారిక ప్రకటనలనే నమ్మాలని ప్రజలకు, పార్టీలకు సూచన
- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- వార్డుల పునర్విభజనపై ఇటీవల హైకోర్టు గ్రీన్ సిగ్నల్

## చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని

# విదేశీ బొగ్గు కొంటున్నారు

## ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ

- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న



హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మిగతా 2 లో

# కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

## అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలి

- ➤ దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది
- ➤ ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- ➤ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం



ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మిగతా 2 లో

### విద్యుత్ బిల్లుల్లో ఈ-చలాన్లు..
# వసూళ్లపై సుప్రీం కీలక సూచన

ఢిల్లీ: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనదారుల నుంచి ఈ-చలాన్ల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. పేరుకుపోయిన చలానాల మొత్తాన్ని వాహనదారుల విద్యుత్ బిల్లులకు జోడించి వసూలు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల ద్వారా వసూళ్లు చేయడం కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో దాదాపు రూ.45 వేల కోట్ల విలువైన ఈ-చలాన్లు పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే వసూలైనట్లు సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈ భారీ బకాయిలపై జస్టిస్ పార్థివాలాతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. "ఒకే మార్గంలో పయనిస్తామంటే ఈ దేశంలో సాధ్యం కాదు. ఈ-చలాన్ల మొత్తాన్ని విద్యుత్ బిల్లులతో అనుసంధానించండి" అని వ్యాఖ్యానించింది. చలాన్లు చెల్లించని వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోర్టు సూచించింది. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) పునరుద్ధరణను నిలిపివేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని నిరాకరించడం వంటి చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. బకాయిల వసూలు కోసం అధికారులు వినూత్నమైన, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

### ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన..
# అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. ప్రధానంగా ఆరు జిల్లాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది. వీటితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ కొన్నిచోట్ల చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురవవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

### భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం..
# పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు..

ఢిల్లీ: భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది. ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు. కానీ, విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లో డీజిల్ వాడకాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించడం, కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదలను నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇటీవల ప్రవేశపెట్టిన హైడ్రోజన్ రైలుకు, ఈ ఎల్ఎన్‌జీ రైలుకు సాంకేతికంగా కీలకమైన వ్యత్యాసం ఉంది. హైడ్రోజన్ రైలులో ఫ్యూయల్ సెల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడిపిస్తే, ఈ ఎల్ఎన్‌జీ రైలులో మాత్రం సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌నే డ్యూయల్ ఫ్యూయల్ కోసం మార్పులు చేసి వినియోగిస్తున్నారు.

## యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా.. భారత్ కీలక నిర్ణయం!

ఢిల్లీ: యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

ఇక పోటీ తప్పనిసరి

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

## స్థానిక ఎన్నికలు ఆలస్యమంటూ పుకార్లు.. ఏపీ ఎన్నికల సంఘం కీలక ప్రకటన

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలల సమయం పడుతుందంటూ వస్తున్న వార్తలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నేడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు, రాజకీయ పార్టీలు వీటిని నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కోర్టు కేసులలో స్పష్టత వచ్చాకే కమిషన్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుందంటూ జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందని పునేఠా తెలిపారు. ఎన్నికలు ఆలస్యమైనా, అంతర్గత ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయని కూడా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వార్తలన్నీ కల్పితమైనవని, కమిషన్ అధికారికంగా జారీ చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణ లేని సమాచారాన్ని నమ్మడం గానీ, ఇతరులకు పంపడం గానీ చేయవద్దని సూచించారు. కమిషన్ పేరుతో తప్పుడు, కల్పిత సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఏదైనా ప్రకటన ఉంటే, అది కేవలం అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా పత్రికా ప్రకటన ద్వారా మాత్రమే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌తో సరిచూసుకున్నాకే విశ్వసించాలని కోరింది. ఇటీవలే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి ప్రారంభించింది. మరోవైపు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా ఎస్ఈసీ సన్నాహాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సెప్టెంబర్ 23తో మండల ప్రజా పరిషత్‌లు, సెప్టెంబర్ 24తో జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### రూ.11,085 కోట్ల భారీ బడ్జెట్‌తో
# 'పల్లె పండుగ 3.0' ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా రామాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనాలతో ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను సమగ్రంగా మెరుగుపరచనున్నారు. ఈ కార్యక్రమంలో సింహభాగం నిధులను గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ.10,250 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,500 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో రూ.7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి. రహదారులతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పలు ఇతర పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు (పశువుల షెడ్లు), పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్లు, పచ్చదనం పెంపు కోసం రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.200 కోట్లు కేటాయించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమివ్వడంతో పాటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'..
# ప్రధాని మోదీ రాజీనామా చేయాలి




ఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### చౌకగా లభించే సింగరేణి బొగ్గును
# కాదని విదేశీ బొగ్గు కొంటున్నారు

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

### నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..
# కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

# కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది

హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పరిపాలించాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్యలో తగ్గుదల ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలన్నారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అసోం దినపత్రిక 'ప్రతిదిన్' మీడియా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. 'India's Next Chapter' అంశంపై జరిగిన చర్చలో దేశ భవిష్యత్ దిశ, విద్య, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సర్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి గారు విస్తృతంగా మాట్లాడారు. దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒక రాష్ట్రంలో ఉన్న సామర్థ్యాన్ని అక్కడి స్థానిక వనరులు, మానవ వనరులతోనే అభివృద్ధి చేసే విధంగా కేంద్రం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులు వంటి కేంద్రం వద్ద సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల విషయాన్ని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రస్తావిస్తూ, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయంగా నష్టం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 1976లో నియోజకవర్గాల సంఖ్యను స్థిరీకరించిన నిర్ణయం, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని అన్నారు. దేశ రాజకీయాల్లో సంఖ్యాబలం కీలకమని, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాల వాదన బలహీనపడుతుందని విశ్లేషించారు. తెలంగాణను.. విద్య, నైపుణ్యాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల ఆధారంగా అభివృద్ధి చేసి, దేశ ప్రగతిలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి గారు తెలిపారు. యువతకు విద్యతో పాటు అవసరమైన నైపుణ్యాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, నర్సరీ విద్య వంటి అంశాలపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రాంతీయ భాషతో పాటు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేలా విద్యా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని, 12వ తరగతి తర్వాత విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

# అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు: సీఎం చంద్రబాబు

అమరావతి: అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్లు పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్లు పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్లు చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సరైన నాయకత్వం, సాంకేతికత, అపారమైన యువశక్తితో ఈ అద్భుతాన్ని సాధించగల సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో మంగళవారం జరిగిన 'మిషన్ కర్మయోగి' వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడంలో (కెపాసిటీ బిల్డింగ్) దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఇదే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన కర్ణాటక, తృతీయ స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాల ప్రతినిధులకు కూడా ఆయన అవార్డులు అందజేశారు.

భవిష్యత్తు మనదే.. మార్పు అనివార్యం

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "భారత్ ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన దశలో ఉంది. మనకు జ్ఞానం, సాంకేతికత, అపారమైన అవకాశాలు ఉన్నాయి. మన యువతలో అసాధారణమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ ఆకాంక్షలను నెరవేర్చేందుకు మన పరిపాలనా వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా? అన్నదే అసలైన ప్రశ్న. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం" అని విశ్లేషించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో మార్పులు చూశానని, ఒకప్పుడు కరెంట్, రోడ్లు, కనీసం ట్యాప్ వాటర్ కూడా లేని గ్రామం నుంచి తాను వచ్చానని గుర్తుచేసుకున్నారు. పదుల గ్రామాలకు కలిపి ఒకే ఒక్క టెలిఫోన్ ఉండేదని, అది కూడా పనిచేసేది కాదని నాటి పరిస్థితులను వివరించారు.

### సాంకేతికతతో సుపరిపాలన

అలాంటి రోజుల నుంచి నేడు డిజిటల్ ఇండియా వరకు దేశం ఎంతో మారిందన్నారు. "గతంలో ఒక ఫైల్ ముందుకు కదలాలంటే ఎల్‌డీసీ నుంచి అదనపు కార్యదర్శి వరకు 15 నుంచి 20 స్థాయిలు దాటాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఫైళ్లు కనపడక రోజుల తరబడి వెతకాల్సి వచ్చేది. కానీ ఈ-ఆఫీస్ విధానంతో ఇప్పుడు నిమిషాల్లో ఫైళ్లను క్లియర్ చేయగలుగుతున్నాం. నేను కూడా రోజుకు 15-20 నిమిషాల్లో ఫైళ్లను పూర్తి చేస్తున్నా" అని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అంగన్‌వాడీ టీచర్ కూడా తనకంటే మెరుగ్గా ఉన్నారని ప్రశంసించారు. రియల్ టైం గవర్నెన్స్, డేటా లేక్, కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, సెన్సార్ల వాడకంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సేవలను చేరవేయడమే లక్ష్యమని వివరించారు.

పిల్లి నల్లదా తెల్లదా అనేది ముఖ్యం కాదు.. ఎలుకను పట్టడమే ముఖ్యం!

ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'మిషన్ కర్మయోగి' ఒక అద్భుతమైన సంస్కరణ అని చంద్రబాబు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ 4,200 కోర్సులు పూర్తి చేసి, జాతీయ స్థాయిలో 14,500 క్రెడిట్లు సాధించడం దీని విజయానికి నిదర్శనమన్నారు. చైనా ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, "పిల్లి నల్లదా, తెల్లదా అన్నది ముఖ్యం కాదు, అది ఎలుకలను పడుతుందా లేదా అన్నదే ముఖ్యం" అనే డెంగ్ షియావోపింగ్ సూక్తిని గుర్తుచేశారు. ఫలితాలు రాబట్టడమే మన అంతిమ లక్ష్యం కావాలన్నారు.

### స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047'గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటును 15 శాతానికి పైగా సాధించే సత్తా ఏపీకి ఉందన్నారు. "ఆంధ్రప్రదేశ్‌ను మిగతా రాష్ట్రాలకు ఒక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా (=ఒణ జవత్‌వతీ), ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌గా నిలబెడతాం. ఇక్కడ విజయవంతమైన నమూనాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా చేస్తాం" అని ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధిని జోడించి సంపద సృష్టించి, ఆ ఫలాలను నిరుపేదలకు అందించడం ద్వారా అసమానతలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని నదుల అనుసంధానం పూర్తయితే భారత్‌ను ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. అంతిమంగా మనమంతా భారతీయులమని, పార్టీలు, ప్రాంతాలు వేరైనా దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు. రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఈదురుగాలుల బీభత్సం డొంకరాయి సమీపంలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్‌పై కూలిన భారీ వృక్షం



చింతూరు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఇటీవల సంభవించిన తీవ్ర తుఫాను, దానికి తోడైన భారీ ఈదురుగాలులు, కుండపోత వర్షం వల్ల మన్యం గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా డొంకరాయి సమీపంలోని శాంతినగర్ గ్రామంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ 4జి టవర్ వద్ద ఒక ప్రమాదకర సంఘటన చోటుచేసుకుంది. టవర్ పక్కనే ఉన్న ఎండిపోయిన వృక్షం, గాలి తీవ్రతకు ఒక్కసారిగా విరిగి బిఎస్ఎన్ఎల్ 4జి టవర్‌కు అమర్చిన సోలార్ ప్యానెళ్లపై పడి కూలిపోయింది. ఈ అనుకోని ప్రమాదంలో సోలార్ ప్యానెళ్లు పూర్తిగా ధ్వంసమై, తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో సంస్థకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బిఎస్ఎన్ఎల్ నిర్వహణ (మెయింటెనెన్స్) అధికారులు వెల్లడించారు. చెట్టు కూలిన వెంటనే ఆ ప్రాంతంలో సెల్‌ఫోన్ సిగ్నళ్లు నిలిచిపోవడంతో శాంతినగర్ గ్రామస్తులు విషయాన్ని గమనించారు. నెట్‌వర్క్ రాకపోవడానికి టవర్‌పై చెట్టు పడటమే కారణమని తెలుసుకున్న స్థానికులు, వెంటనే స్పందించి ఐక్యతతో శ్రమించి ఆ వృక్షం కొమ్మలను తొలగించారు.ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న వెంటనే బిఎస్ఎన్ఎల్ టెక్నికల్, మెయింటెనెన్స్ సిబ్బంది హుటాహుటిన రెస్పాన్స్ అయ్యి రెస్క్యూ చర్యలు చేపట్టారు. ధ్వంసమైన ప్యానెళ్లను పరిశీలించిన



అనంతరం, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సేవలను విజయవంతంగా పునరుద్ధరించినట్లు బి యస్ ఎన్ ఎల్ అధికారులు అధికారికంగా తెలిపారు. సమయస్ఫూర్తితో స్పందించి చెట్టు కొమ్మలను తొలగించడంలో సహకరించిన గ్రామస్తులకు అధికారులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# "విద్యాభివృద్ధికి సహకరిద్దాం వనిత లయన్ క్లబ్ సెక్రటరీ కాళ్ళ అరుణకుమారి"



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 29 (నేటి -శుభోదయ) ప్రభుత్వపాఠశాలలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కి స్వచ్ఛంద సంస్థలు ప్రజలు కూడా సహకారం అందించాలని లయన్స్ జిల్లా 316జి గవర్నర్ లయన్ డాక్టర్ దశక సుబ్బారావు, రిజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ల ప్రోత్సాహం తో తాడేపల్లిగూడెం వనిత లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవలు అందివ్వాలనే ఆలోచన తో సేవా కార్యక్రమంలు చేపట్టామని స్థానిక గరల్స్ హైస్కూలు అభివృద్ధి కి సహకారం అందిస్తున్నామని అని వనిత లయన్స్ క్లబ్ సెక్రెటరీ లయన్ కాళ్ల అరుణ కుమారి అన్నారు.క్లబ్ ఎడ్మిన్ లయన్ ఇంద్రవాణి అధ్యక్షతన గరల్స్ హైస్కూలు విద్యార్థులు తో అవగాహన కార్యక్రమం లో పాల్గొన్నారు. స్కూల్ గ్రౌండ్ కు ఆటలకు అణువు గా మార్చేందుకు లయన్ కాళ్ళ గోపి కృష్ణ సహకారం తో మిషన్ తో కొంత మేర గ్రౌండ్ ను చదును చేయించారు. సిబ్బంది మాట్లాడుతూ వనిత లయన్స్ క్లబ్ సెక్రెటరీ లయన్ అరుణ కుమారి కి సమస్య తెలియ తెలియజేసిన వెంటనే పరిస్కారం చేసినందుకు స్కూల్ తరపున ధన్యవాదములు తెలిపారు. అలానే విద్యార్థులకు అభినందనలు అందించి ప్రకృతి పర్యవరణకు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ. శ్రీనివాసరావు. కృష్ణంరాజు మరియు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా లక్ష్మీ గణపతి హోమ పూజలు

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు చైర్మన్ శాయన రాజేష్**

**అక్టోబర్ 4న నవరాత్రుల మహా అన్నసమారాధన**



గుడివాడ, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శ్రీ లక్ష్మీ గణపతి హోమ పూజలను వైభవంగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిర్వహించిన హోమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.హోమ పూజల అనంతరం దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈవో యార్లగడ్డ వాసు, కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి పూర్ణాహుతి సమర్పించారు.

స్వామివారి ఆశీస్సులతో ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయని చైర్మన్ శాయన రాజేష్, ఈవో వాసు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు వారు ధన్యవాదాలు తెలిపారు.అక్టోబర్ 4న దేవస్థానం ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అనంతరం హోమ పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో యార్లగడ్డ వాసు, కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు,

ముళ్ళపూడి రమణమూర్తి, వికుర్తి పోతురాజు, వీరమాచినేని శైలజ, చాపరాల విజయలక్ష్మి, సోసుపల్లి శారద, గొంతుపుల్లి కనకదుర్గ, గణపతి శాస్త్రి, ఆలయ సిబ్బంది నారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పాడి చెత్తకు స్వచ్ఛ రథం ద్వారా నజరానా అందిస్తాం ఎంపీడీవో చంద్రశేఖర్"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 29 (నేటి- శుభోదయ) గ్రామపంచాయతీల్లో ఇళ్ల నుంచి సేకరించే పొడి చెత్తకు స్వచ్ఛ రథం ద్వారా ప్రభుత్వం నజరానా అందిస్తుందని ఆ నజరానాను రాబోయే దసరా సందర్భంగా 40 శాతం వరకు పెంచి అందిస్తున్నారని తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన స్వచ్ఛతా హిసేవ కార్యక్రమం పై వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్రామాల వారి టామ్ టామ్ లు వేస్తున్నామని, మైక్ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ పొడి చెత్త కార్యక్రమం పై ప్రభుత్వం అందించే నజరానా వివరాలు గ్రామ సచివాలయాల వద్ద గ్రామ కూడళ్ల వద్ద ప్రజలు చూసేందుకు అందుబాటులో ఉంచామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలనుంచి కొబ్బరి బొండం వరకు 33 రకాల పొడి చెత్తకు ధరలు ఉన్నాయని తెలిపారు. ప్రజలంతా కూడా పొడి చెత్త వ్యర్థాలను స్వచ్ఛ రథానికి అందించి నిత్యవసర సరుకులను పొందవచ్చని తెలిపారు. దీనిపై గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేసి ప్రజల నుంచి స్వచ్ఛ రథం ద్వారా పొడి చెత్త సేకరించాలని సూచించారు. ఈ పొడి చెత్త అందించే ప్రజలలో ఎక్కువగా అందించిన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో కూడా లక్కీ డిప్ గా ఎంపిక చేసి ఆకర్షనీయమైన బహుమతి కూడా ఉంటుందని తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి ప్రత్యేక కృషి

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం జూపాడు బంగ్లా మండలం తరిగోపుల గ్రామం, కొత్తపల్లి మండలం ఎం. లింగాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామంలో రెండు సిమెంట్ రోడ్లు, రెండు రక్షణ గోడలు రూ. 20 లక్షలతో పూర్తి చేసిన పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్, అదనంగా సిమెంట్ రోడ్లు కూడా కొత్తగా మంజూరు చేస్తున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. తరిగోపులలో మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరావు, పి ఆర్ డి ఈ సుధాకర్ బాబు, ఏ ఈ బసిర్, ఎంపీడీఓ గోపినాథ్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ వెంకటరమణ, పారుమంచాల కరుణాకర్ రెడ్డి, శివ చంద్రుడు, బాలస్వామి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండలం ఎం. లింగాపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండల కేంద్రం కొత్తపల్లి గ్రామంలోని పురాతన తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా నిధుల విడుదలకు కృషి చేస్తానని, దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనులకు అన్ని విధాలుగా సహకరిస్తానని గ్రామ పెద్దలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ జుబేర్, ఎం. లింగాపురం చిన్న. పుల్లారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, నరాల శ్రీనాథ్ రెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, మినరల్ వాటర్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయనగర లా కాలేజ్‌లో 'యువత భవితకు భరోసా" కార్యక్రమం నిర్వహణ..

**పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ..**




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న విజయనగర లా కాలేజ్‌లో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, లా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ న్యాయ విద్య అనేది కేవలం ఒక వృత్తికి సంబంధించిన విద్య మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, ధర్మం, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యతను ప్రతి న్యాయ విద్యార్థికి అందించే గొప్ప విద్య అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్య, ఆధునిక సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యత లభిస్తోందని, యువతలో ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన అవకాశాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, న్యాయ రంగంలో వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించడంలో, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. వివిధ కేస్ స్టడీల ద్వారా న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చని, తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చేయడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ కళాశాల నుంచి గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఉండటం అభినందనీయం. జూనియర్ న్యాయవాదులకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, విద్యార్థులను న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కళాశాల చేస్తున్న కృషి ప్రశంసనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ రామిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ రాఘవేంద్రచారి, సీనియర్ అడ్వకేట్ నరసింహులు, సీనియర్ లెక్చరర్ హరి, అధ్యాపకులు లా విద్యార్థులు పాల్గొన్నారు.



# చింతూరు డిగ్రీ కాలేజి నిర్మాణం త్వరతగితిన పూర్తి చేయాలి : ఎస్.ఎఫ్.ఐ.

– నిర్మాణం పూర్తి అయిన గదులు డిగ్రీ కాలేజీకి అప్పగించాలి : ఎస్.ఎఫ్.ఐ.




చింతూరు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) స్కూల్ బచావో కార్యక్రమం సందర్భంగా రాష్ట్రంలో అన్ని పాఠశాలలు, కళాశాలలు పరిశీలిస్తూ చింతూరులో ఉన్న డిగ్రీ కాలేజి సందర్శించారు . ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి కె. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ డిగ్రీ కాలేజీకి ఇప్పటికే నిర్మాణం చేసిన నూతన భవనం గదులు కాలేజీకి అప్పగించాలని. మరో భవనం నిర్మాణానికి 5 కోట్ల నిధులు కేటాయించారని అన్నారు. త్వరగా కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలని అలాగే పొలిటికల్ సైన్స్ కి అధ్యాపకులను కల్పించాలని, అలాగే నూతన భవనం దగ్గర అమ్మాయిలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి అక్కడ క్లాస్ లు ప్రారంభించాలని మంచినీళ్ళు సదుపాయం కల్పించాలని అన్నారు. అలాగే బాలుర హాస్టల్ పాత భవనం అవటం తో వర్షానికి నీరు కారుతుందని ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు బిక్కు బిక్కుమని ఉంటున్నారని అన్నారన్నారు. కాబట్టి తక్షణమే హాస్టల్ భవనాలు నిర్మాణం చేయాలని, అమ్మాయిల హాస్టల్ లో త్రాగునీరు, వాడుక నీరు కూడా ఇబ్బంది గా ఉన్నాయని, వంట గది లేదని అన్నారన్నారు. తక్షణమే మంచినీరు సదుపాయం కల్పించాలని, వంట గది కూడా నిర్మాణం చేయాలని అన్నారు. విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కమిటి సభ్యులు లోవరాజు, ఎస్.ఎఫ్. ఐ నాయకులు వై. భాస్కర్, క్రాంతి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్, సుబ్బారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా పేదలకు ఆర్థిక సాయం అందించాలన్నదే సీఎం ధ్యేయం

**నియోజవర్గ వ్యాప్తంగా ఈ రెండేళ్ల కాలంలో సుమారు 500 మందికి రూ.4కోట్ల 50 లక్షలు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందించాంలి**

**పుట్టపర్తి లో 13 మంది లబ్ధిదారులకు రూ.7.25 లక్షల ముఖ్యమంత్రిలి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**



అనంత పురం సెప్టెంబర్ 29: నేటి శుభోదయ : పేద ప్రజలకు ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.7 లక్షల 25 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలు, వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆపదలో ఉన్న పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలో ఈ 26 మాసాల కాలంలో సుమారు 500 మందికి నాలుగు కోట్ల 50 లక్షలు రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక సహాయాన్ని అందించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.నియోజవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రాలు , అభివృద్ధి చేస్తూ పెద్ద ఎత్తున సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని,కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# "తాడేపల్లిగూడెం పట్టణంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న వైసిపి ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు"



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 29 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం పట్టణంలో పలు కార్యక్రమంలో వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురామనాయుడు పాల్గొన్నారు. ముందుగా పెంటపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయ రాంబాబు ముద్దుల మనవడు "యోగేష్ అండ్ పార్థసారథి జయరాం" ల పుట్టినరోజు వేడుక స్థానిక రేణుక ఫంక్షన్ హాల్ లో జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వడ్డు రఘురామ నాయుడు హాజరై "యోగేష్ పార్థసారథి జయరాం" లను ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లో టాక్సీ స్టాండ్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ యూనియన్ సభ్యులు నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ సిద్ధి వినాయక చవితి మహోత్సవం సందర్భముగా అఖండ అన్న సమారాదనలో పాల్గొని వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని పట్టణ ప్రజలకు నియోజకవర్గ ప్రజలఅందరికీ ఆ భగవంతుడు ఆశీస్సులు ఉండాలని వినాయకుని ప్రార్థించారు. 18 వ వార్డు తాళ్ల ముదునూరుపాడులో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవం అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని వినాయకుని ఆశీస్సులు పట్టణ ప్రజలకు, నియోజకవర్గ ప్రజలు అందరికీ ఆశీస్సులు కలగాలని ఆ వినాయకుని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీసభ్యుడు రెడ్డి సూరిబాబు, సంపత రావు కృష్ణారావు, లంకా రాజశేఖర్, చిట్టూరి బాపన్న, దేవరశెట్టి రాంబాబు, వట్టి బుజ్జి బండారు రాంబాబు, దేవరశెట్టి రాంబాబు మరియు టాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ నాయకులు మరియు ముదునూరుపాడు 18 వ వార్డు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో హామ్ నిధులతో మూడో రోజు రోడ్ల అభివృద్ధి పనులు

-పలు వార్డుల్లో శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే రాము

-5,6,21,22 వార్డుల్లో శంకుస్థాపనలు....30 ఏళ్ల తర్వాత రైలుపేట మెయిన్ రోడ్డు అభివృద్ధితో స్థానికుల హర్షం

-పట్టణంలోని అనేక ప్రాంతాల్లోనూ రోడ్ల వ్యవస్థ లేదు కూటమి ప్రభుత్వం తొలిసారిగా రోడ్లు వేస్తుంది:ఎమ్మెల్యే రాము

-మున్సిపల్ ఎన్నికలు 100 శాతం జరుగుతాయి

-జరగవని ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూట్ పాలిష్ ఛాలెంజ్ నిలబెట్టుకుంటాడా

-ఎన్నికల్లో విజయం సాధించలేమనే భయంతోనే మాజీ ఎమ్మెల్యే ఎన్నికలు జరగవని ప్రచారం చేస్తున్నారు

-ఎవరో పోటీ చేయడం ఎందుకు.. మాజీ ఎమ్మెల్యేనే పోటీ చేయాలి....నా అభ్యర్థి చేతిలో 30 వేల మెజారిటీతో ఓడిస్తా



గుడివాడ, సెప్టెంబర్ 29నేటి శుభోదయ: గుడివాడ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ నిధులతో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులు మూడో రోజు కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి వివిధ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

పర్యటనలో భాగంగా ఐదో వార్డులోని రోటరీ భవన్ రోడ్డు, ఆరో వార్డులోని చైతన్య భారతి స్కూల్ రోడ్డు, 21వ వార్డులోని మందపాడు బెనర్జీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపన చేశారు. అలాగే రైలుపేట మెయిన్ రోడ్డుతో పాటు 22వ వార్డులో సుమారు రూ.58 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ప్రతి ప్రాంతంలో స్థానిక ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ ఎమ్మెల్యే రాము వారి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. రైలుపేట ప్రాంతంలో సుమారు 30 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 'థాంక్యూ రామన్న.. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు.పర్యటన సందర్భంగా పలువురు స్థానికులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. గుడివాడ పట్టణంలో రోడ్ల అభివృద్ధి పనులకు వరుసగా మూడో రోజు శంకుస్థాపనలు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో ఇంకా రోడ్లు అవసరమైన ప్రాంతాలను గుర్తించి, దశలవారీగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.ఇప్పటివరకు పట్టణ శివారు ప్రాంతాల్లోనే రోడ్లు లేవని భావించేవాళ్లమని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న సమయంలో పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రోడ్ల వ్యవస్థ లేదన్నారు. అలాంటి ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చి కూటమి ప్రభుత్వంలో తొలిసారిగా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.రైలుపేటలో ఎన్నో ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూస్తున్న ప్రజల అవసరాన్ని గుర్తించి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనప్పుడు స్థానిక ప్రజల్లో కనిపించిన ఆనందం తనకు మరింత బాధ్యతను పెంచిందని చెప్పారు.గుడివాడ ప్రజలందరికీ ఒక మాట ఇస్తున్నా దుమ్ములేని, మెరుగైన రహదారులతో గుడివాడను అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తాం" అని ఎమ్మెల్యే రాము తెలిపారు. గుడివాడ పట్టణంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. తాగునీటి వ్యవస్థ అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచిన అనంతరం డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను ఒకదాని తర్వాత ఒకటి మెరుగుపరచడమే లక్ష్యం" అని పేర్కొన్నారు. గతంలో గుడివాడ గురించి ప్రతికూలంగా మాట్లాడుకునే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధితో గుడివాడ ప్రజలు తమ ప్రాంతం గురించి గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

### ఎన్నికలపై ప్రతిపక్ష నాయకుల వ్యాఖ్యలకు రాము స్పందన

మున్సిపల్ ఎన్నికలు జరగవంటూ మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ప్రచారంపై ఎమ్మెల్యే రాము స్పందించారు. ఎన్నికలు నిర్వహించరనే ప్రచారంలో వాస్తవం లేదని, మున్సిపల్ ఎన్నికలు తప్పకుండా జరుగుతాయని ఆయన అన్నారు. గుడివాడలో 100 శాతం ఎన్నికలు జరుపుతామని అప్పుడేనా మాజీ ఎమ్మెల్యే బూట్ పాలిష్ ఛాలెంజ్ నిలబెట్టుకుంటాడా అని ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. ఎన్నికలు జరగవని ప్రచారం చేస్తున్న వారు ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలు జరిగినప్పుడు ప్రజల తీర్పే అన్నింటికీ సమాధానం చెబుతుంది" అని ఎమ్మెల్యే రాము అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడితే పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరే అవకాశం ఉంటుందని, ప్రజలకు అవసరమైన మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికలపై మాజీ ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఎమ్మెల్యే రాము ఆరోపించారు. ఎన్నికల్లో విజయం సాధించే పరిస్థితి లేకపోవడం ఒక కారణమైతే, పార్టీ తరఫున పోటీ చేసే కొత్త నాయకులు భవిష్యత్తులో ప్రత్యామ్నాయంగా ఎదుగుతారనే ఆందోళన మరో కారణమని ఆయన వ్యాఖ్యానించారు. అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ వారిని వెనుక నుంచి దెబ్బతీసే విధంగా వ్యవహరించడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటుగా మారిందని రాము ఆరోపించారు. ఎవరో పోటీ చేయడం ఎందుకు.. మాజీ ఎమ్మెల్యేనే పోటీ చేయాలనీ, నేను నిలబెట్టే అభ్యర్థి చేతిలో 30 వేల మెజారిటీతో ఓడిస్తానని మరోసారి సవాల్ చేస్తున్నాను" అని ఎమ్మెల్యే రాము అన్నారు. గుడివాడ అభివృద్ధిని రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలో కొనసాగుతున్న రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా పూర్తి చేసి గుడివాడను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో మున్సిపల్ ఎం.ఈ సతీష్ చంద్ర, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి ప్రధాన కార్యదర్శి బొంబాయి శ్రీను, కార్పొరేషన్ డైరెక్టర్లు మజ్జాడ నాగరాజు,దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, కంచర్ల సుధాకర్, వేషపోగు ఇమ్మానుయేలు, పోలాసి ఉమా, అడుసుమిల్లి శ్రీనివాసరావు,మాదాల సునీత, రెడ్డి షణ్ముఖ, జానీ షరీఫ్, మూడేడ్ల సూర్యనారాయణ రావు, కూటమి నాయకులు వేమూరి త్రినాథ్ పాండురంగారావు, వినోద్, సాయి, గునుకుల వినోద్,సాయి కృష్ణ, కొదమల గంగాధర్, పైడిముక్కల వంశీ, నాగూర్ భాష, దారపురెడ్డి మహేశ్వరరావు, కాజా శ్రీను, రోజా, భాగ్యలక్ష్మి, ద్వారక, విశ్వనాథ నాగేశ్వరరావు, పిచ్చేటి రాజేశ్వరరావు, పల్లారావు, నీలవేణి, కుందేటి విష్ణు ప్రసాద్, నారాయణరావు,లోయ రాజా, చక్కర గడ్డ శ్రీనివాసరావు, గేదల కళ్యాణి, సీతాల సుభాషిని, ఆఖరి రాజేష్, బొట్టు కొండ, సౌకత్, జమీర్ భాష, బొట్టు సత్యనారాయణ, జువ్వనపుడి నిరంజన్, చుక్క వెంకటేశ్వరరావు, కంచర్ల ఉదయ్ భాస్కర్, దేవేంద్రుడు, గోపాలకృష్ణ, తలుపుల వీరబాబు, దోనేపూడి శ్రీనివాసరావు, తరంగి మోహన్ రావు, కూరల వెంకటలక్ష్మి,మల్లవల్లి వెంకటనారాయణ, పార్వతి, కొప్పుల శ్రీను, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐ.సి.టి.సి. కౌన్సిలర్లకు సమీక్షా సమావేశం

: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్



మెదక్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ విభాగంలో పనిచేస్తున్న డాప్కో, ఐ.సి.టి.సి. కౌన్సిలర్లకు సమీక్షా సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో లెప్రసి, ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి డిప్యూటీ డైరెక్టర్ ప్రియదర్శిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ పాల్గొన్నారు. జిల్లాలో హెచ్.ఐ.వి. వైరస్ లోడ్ ను తగ్గించాలని, ట్రీట్మెంట్ తీసుకుంటున్నావారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలనీ, ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థుల్లో హెచ్.ఐ.వి. పట్ల అవగాహన కల్పించాలని, హెచ్.ఐ.వి. పేషంట్లను మానవత దృక్పదంతో ఆదరించాలని, వారి జీవన ప్రమాణాలను పెంచాలని, వారిలో నిరాశ నిస్పృహలను దూరం చేయాలనీ, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ లేని సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ ప్రియదర్శిని తెలిపారు. జిల్లాలో హెచ్.ఐ.వి.ఎయిడ్స్ వ్యాప్తిని అదుపులో ఉంచామని, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, ప్రజల వద్దకే వెళ్లి హెచ్.ఐ.వి. స్క్రీనింగ్ చేపట్టాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువకులను టార్గెట్ చేసి వారికి పూర్తి అవగాహన కల్పించాలని, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ కు దూరంగా ఉంచాలని, యూత్ ను క్రీడలు, ఇతర నైపుణ్యాలలో ఇన్వాల్వ్ చేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు.



కార్యక్రమంలో హెచ్.ఐ.వి.ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిప్రసాద్, పి.ఎం.ఓ. శంకర్ రాతోడ్, మాస్ మీడియా ఆఫీసర్ అన్వర్, డాప్కో ఐ.సి.టి.సి., కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## "రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనసేన కార్యకర్త ముత్యాలు కు ఆర్థిక సాయం అందజేసిన బొలిశెట్టి రాజేష్"



తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త, జనసేన సాధక్ మొఖమట్ల వెంకట ముత్యాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.దవడకు శస్త్రచికిత్స అవసరం కావడంతో ఈ విషయాన్ని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కు ఆకుతీగపాడు జనసేన నాయకులు తెలియజేశారు. వెంటనే స్పందించి ముత్యాలు కుటుంబ సభ్యులకు శాసన సభ్యుల ఆదేశాల మేరకు రూ.1,15,000/-(లక్షా 15 వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని బొలిశెట్టి శ్రీనివాస్ కుమారుడు, జనసేన యువనాయకుడు బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా మంగళవారం వెంకట ముత్యాలకు కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, బొలిశెట్టి రాజేష్ కుటుంబానికి వెంకట ముత్యాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోంది

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్





అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరం లోని అలెగ్జాండర్ హోటల్ నందు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు "ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ప్రతి ఒక్కరిని లక్ష్యాధికారులుగా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుందన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనేక వనరులు ఉన్నాయని యువత వీటిని సద్వినియోగం చేసుకొని తమకు అనుకూలమైన పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందని ప్రభుత్వ రాయతీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ప్రతి కుటుంబంలోని యువతీ యువకులు ముందుకు వచ్చి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలన్నారు. డి ఆర్ డి ఏ, మెప్మా పరిశ్రమల శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఏడాది ఐదు లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా నిరుద్యోగ యువత ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...యువత పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. "వన్ ఫ్యామిలీ -- వన్ ఎంట్రప్రెన్యూర్" కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటంతో పాటు, అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. మన చుట్టూ ఉన్న స్థానిక అవసరాలు, ప్రజల సమస్యలు, మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను గుర్తించి వాటికి అనుగుణంగా వ్యాపారాలను ప్రారంభిస్తే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగంలో యువతకు, మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలి. అనంతపురం జిల్లాలో అరటి, టమాటా, వివిధ రకాల పండ్లు వంటి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి అవకాశాలు ఉన్నాయి. వీటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి, ప్రాసెసింగ్ మరియు ప్యాకేజింగ్ రంగాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి, దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు చేసే స్థాయికి మన యువ పారిశ్రామికవేత్తలు ఎదగాలి.ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మార్కెటింగ్, ఈ-కామర్స్, డిజిటల్ షాపింగ్ వంటి అవకాశాలను ఉపయోగించుకుని మన ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లాలి. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.... ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. దీంతో ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త వర్క్ షాప్ నిర్వహించి యువతకు పరిశ్రమలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు అనుకూలమైన పరిశ్రమల స్థాపించేందుకు ముందుకు వెళ్లాలన్నారు. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రతి ఇంటికి ఒక సాఫ్ట్వేర్, ఇంజనీర్ ఒక హార్డ్వేర్ ఇంజనీర్ తయారు చేయాలనే ఉద్దేశంతో హైదరాబాదును హైటెక్ సిటీగా అభివృద్ధి చేసి ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా నేడు ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అనంతపురంలో కియా పరిశ్రమ ఏర్పాటుచేసి తద్వారా 50వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని ఒక పరిశ్రమ ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా అనేక రకాల స్మాల్ ఇండస్ట్రీస్ వస్తాయన్నారు. దీంతో ఆ ప్రాంత రూపురేఖలు మారిపోయి అభివృద్ధి చెందుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఒక చిన్న పరిశ్రమ ఉంటుందని దీంతో గుజరాత్ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందిందన్నారు. మన అనంతపురం జిల్లా వాసులు గుజరాత్ ను ఆదర్శంగా తీసుకొని ఇక్కడ స్వయం సహాయక సంఘ సభ్యులు చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, ఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్ శ్రీమతి నాగకుమారి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శ్రీ వెంకటనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీ లక్ష్మీ ప్రసాద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ పరమేష్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ కొండయ్య, హాస్పిటల్ కమిటీ సభ్యులు శ్రీ నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీమతి శైలజ, జిల్లా వ్యాపారవేత్తలు, పారిశ్రామిక అధికారులు, సిబ్బంది మరియు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## జగ్గంపేటలో పల్లె పండుగ 3.0 అభివృద్ధి జాతర.. అభివృద్ధికి కేరాఫ్ జ్యోతుల నెహ్రూ

శెట్టిబలిజిపేటలో 3 జిఎల్ఆర్ ట్యాంకులతో సురక్షిత శుద్ధిచేసిన మంచినీటి పథకం, 75 లక్షలతో మంతెన నీలాద్రిరాజు మార్గం ప్రారంభం



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమం జగ్గంపేట నియోజకవర్గంలో అభివృద్ధి జాతరలా సాగింది.

జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు.మొదట శెట్టిబలిజిపేటలో భావారం ఫిల్టర్ వాటర్ స్కీం నుండి శుద్ధి చేసిన సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన 3 జిఎల్ఆర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ట్యాంకులతో ఆ ప్రాంత ప్రజల దీర్ఘకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.అనంతరం గోకవరం రోడ్డులోని బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు మెయిన్ రోడ్డు నుండి 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. జగ్గంపేట పట్టణ ప్రముఖులు, దాత మంతెన నీలాద్రిరాజు గారి సేవలను గుర్తిస్తూ ఆ రోడ్డుకు మంతెన నీలాద్రిరాజు మార్గము గా నామకరణం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 11 వేల కోట్ల రూపాయలతో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి జాతర జరుగుతోందని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, అడపా భరత్, రాష్ట్ర డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, గెద్దాడ సత్యవేణి, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, మారిశెట్టి భద్రం, కన్నబాబు, కందుల చిట్టిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి,పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ఎస్ఏ గఫూర్ కూటమి నాయకులు, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గొల్లలగుంట హై స్కూల్ విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

- చైర్మన్ గా గొంప శివ రామకృష్ణ



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 29 నేటి శుభోదయద: జగ్గంపేట మండలం గొల్లలగుంట జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు అన్ని కులాలకు, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ ఏకగ్రీవంగా జరిగాయి.ఈ ఎన్నికల్లో చైర్మన్ గా గొంప శివ రామకృష్ణ, వైస్ చైర్మన్ గా గండికోట శివ గంగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ గొంప శివ రామకృష్ణ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ పెద్దలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ సహకారంతో పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులుగా గోపిల్లు వరలక్ష్మి, గంజి అప్పలరాజు, గుర్రాల నాగరాజు, కొత్తపల్లి దుర్గా భవాని, కర్రి వెంకట లక్ష్మి, పొన్నాడ సత్యవాణి, పితాని భవాని, బత్తిన రమేష్, ఇచాపవరపు పద్మావతి దేవి, కాపవరపు వెంకట రమణ, కుంజం సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా నియమితులయ్యారు. విజయం సాధించిన వారందరికీ కూటమి నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరుమల రాజు మురళి రాజు, కలిదిండి శేఖర్ రాజు, కృష్ణంరాజు,పి మురళి రాజు, చిత్ర పుబాబు, ఈశ్వరరావు, కే బుజ్జి,కృష్ణుడు రేగళ్ల రమణ,సూర్యచంద్ర,వీరబాబు,పి శ్రీను, దుర్గయ్య, కాటమరాజు, గొల్లలగుంట కూటమి నాయకులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతి మంగళవారం 500 మందికి ఉచిత అన్నదానం నిర్వహిస్తున్న తుమ్మలపల్లి రమేష్

**జనసేనాని పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో..**

**సొంత నిధులతో తుమ్మలపల్లి రమేష్ సేవా కార్యక్రమం**



కాకినాడ జిల్లా, జగ్గంపేట, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందించారు. తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవా స్ఫూర్తితో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రమేష్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని తన సొంత నిధులతో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.పేదలు, కూలీలు, వృద్ధులు, ప్రయాణికులు, అవసరంలో ఉన్న వారికి ఉచితంగా భోజనం అందిస్తూ వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.అన్నదాన కార్యక్రమానికి వచ్చిన వారితో రమేష్ ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైభవంగా తల్లిదండ్రుల యాజమాన్య కమిటీ' ఎన్నికలు




కాకినాడ జిల్లా,?జగ్గంపేట సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2026 సంవత్సరానికి గానూ 'తల్లిదండ్రుల యాజమాన్య కమిటీ' ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో, జయప్రదంగా నిర్వహించబడ్డాయి. ప్రభుత్వం వారి ఉత్తర్వుల మేరకు ఉదయం 9 గంటల నుంచి పాఠశాల ప్రాంగణంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ?ఈ ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఐక్యతతో, ప్రజాస్వామ్య బద్ధంగా ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ నిబంధనల ప్రకారం ఎస్సీ నుంచి 3o2, ఎస్టీ నుంచి 01, బీసీ నుంచి 5o5, మరియు ఓసీ నుంచి 2o1 నిష్పత్తిలో మహిళలు, పురుష సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.




నూతన పాలకవర్గం:
కమిటీ చైర్మన్: శ్రీమతి ఏనుగు పద్మావతి
వైస్ చైర్మన్: శ్రీమతి దొండ్ల భవానీ

ఈ ఎన్నికల ప్రక్రియకు మండల విద్యాశాఖాధికారి ఆర్ స్వామి పరిశీలకులుగా వ్యవహరించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావు ప్రిసైడింగ్/ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మల్లేశ్వరి బేగం, దాసరి బాబూరావు, వి ఎస్ ఎన్ మూర్తి,, సుబ్రహ్మణ్యం, డి పద్మావతి, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విశేష కృషి చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులకు శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ , జ్యోతుల నవీన్ , మారిశెట్టి భద్రం , ఎస్ వి ఎస్ అప్పలరాజు , జాను మురళి, పలువురు ప్రముఖులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, క్రమశిక్షణతో కూడిన భవిష్యత్తును అందించాలని నూతన కమిటీకి ఈ సందర్భంగా సూచించారు.

## ఏ.ఆర్.ఎస్ రేకులకుంటలో ఘనంగా అగ్రి ఎక్స్పో కిసాన్ మేళా..



అనంతపురం, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : వ్యవసాయ శాఖ, ఆత్మ అనంతపురం వ్యవసాయ పరిశోధన స్థానం రేకులకుంట ఆధ్వర్యంలో మంగళవారం ఏ.ఆర్.ఎస్ రేకులకుంటలో అగ్రి ఎక్స్పో కిసాన్ మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బల్ల పల్లవి, ఇతర ప్రజాప్రతినిధులు మరియు వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఆర్ఎస్ రేకులకుంట, కె.వి.కె రెడ్డి పల్లి మరియు కె.వి.కె కళ్యాణదుర్గం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్టోబర్ 2 తేదీన మదనపల్లిలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ తో లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ తో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేస్తున్నామని తెలియజేశారు. కరువు, వెనుకబడిన అనంతపురం జిల్లాను అభివృద్ధి బాటలో పయనించడానికి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన కింద నిధులు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు చేస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో శీతల గిడ్డంగులు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు అదేవిధంగా జిల్లాలోని పండ్ల తోటల్లో ఉత్పత్తి నాణ్యతను పెంచి రాయలసీమను గ్లోబల్ హబ్ గా తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలియజేయడం జరిగినది. అగ్రి ఎస్పో కిసాన్ మేళలో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖల, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రదర్శనశాలలు మరియు యంత్ర పరికారాలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీల ప్రదర్శనశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, ఏపిఎంఐపీ పిడి రఘునాథరెడ్డి, ఆత్మ పిడి విద్యావతి, జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్చంద్, సిటీడఐఓ లక్ష్మనాయక్, ఆయా శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, పాల్గొన్నారు.



## ఉప్పలపాడులో లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్

**ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న జనసేన ఇంచార్జ్**



కాకినాడ జిల్లా,జగ్గంపేట సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి సరస్వతి ఆలయం 47వ వార్షికోత్సవం, గణపతి నవరాత్రులు, సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన ప్రసాద కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పలపాడు గ్రామ జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను తుమ్మలపల్లి రమేష్కు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.ఆలయ వార్షికోత్సవం, గణపతి నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం పలకాలి పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్నగర్లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ఘన స్వాగతం పలికేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పేదల ఎన్నో ఏళ్ల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బొండా ఉమా సూచించారు. పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారికి శాశ్వత హక్కును కల్పించడంతో పాటు, వారి కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు. పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్వాగత ఏర్పాట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యుల భాగస్వామ్యం తదితర అంశాలపై ఎమ్మెల్యే ఉమా పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు ఘన స్వాగతం పలికి, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమా పిలుపునిచ్చారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రానున్న పురపాలక ఎన్నికల నిర్వహణకు ఖరారు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులో ఉన్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తి నివేదిక సమర్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ శాఖాధిపతులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో కమిషనర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సెప్టెంబర్ 28వ తేదీన నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖరారైన పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లు, ర్యాంపులు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు సక్రమంగా ఉన్నాయో లేదో ప్రతి నియోజకవర్గ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట పర్యవేక్షక ఇంజనీర్ల సహకారం తీసుకొని తనిఖీలను త్వరితగతిన పూర్తి చేసి, సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. అదేవిధంగా నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

## వికసిక్ భారత్ సేవా సంకల్ప్ అభియాన్

**చిత్రలేఖనం పోటీలు**





విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఆదేశాలతో వివేకానంద సెంటినరీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో మంగళవారం నిర్వహించారు. అజిత్ సింగ్ నగర్ మండలం అధ్యక్షులు గొట్టుముక్కల రమేష్ రాజు అధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ ముప్పల వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ హరిత మాధవి లత, మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు బొమ్మదేవర రత్నకుమారి, జొన్నవిత్తుల రామకృష్ణ, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు శివ కృష్ణారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ ఆదిశేషు, మండల ఇన్చార్జి జి. స్వరూపరాణి, బొమ్మదేవర శ్రీనివాస్ , సర్వశుద్ధి రాజు, హేమంత్ జైన్, ఉప్పులూరి గోపాలకృష్ణ, పార్వతి బాయ్, లలిత, నీరద, శివ దుర్గ, గాయత్రి, రామకృష్ణ, కె.వి సుబ్బారావు, స్కూలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు

**వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-గుండె సంబంధిత జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచించారు. 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా మంగళవారం ఉదయం రామచంద్రనగర్ లోని తెలుగుదేశం నాయకులు గద్దె రమేష్ ఆధ్వర్యంలో ఆయుష్ ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రారంభించారు. అనంతరం డివిజన్లోని నిరుపేదలకు జీవనోపాధి కల్పించేందుకు రూ. 50 వేలు విలువ చేసే కొర్ని చెల్లయ్యకు ఇస్త్రీ బండిని, వీఎస్ఎస్ సత్యనారాయణకు టిఫిన్ బండిని ఎమ్మెల్యే గద్దె తన సొంత నిధులతో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పేదల కోసం గుండె, మెదడుకు వచ్చే వ్యాధులను ముందస్తుగా నిర్ధారించేందుకు ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. గుండె నుంచి రక్త ప్రవాహం ఎలా జరుగుతోంది? మెదడుకు వెళ్లే రక్త నాళాల్లో పూడికలు ఉన్నాయా లేవా? అని ముందుగానే గుర్తించే కలర్ డాప్లర్, సిటీ స్కాన్, కాల్షియం స్కోర్, అల్ట్రాసౌండ్ పరీక్షల్లో 50% రాయితీతో సేవలు అందించడం గొప్ప విషయం పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న వయసులోనే గుండె జబ్బులకు గురై చాలా మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా మొదటి దశలోనే గుర్తిస్తే చాలా వరకు నయం చేసుకోవచ్చునని, ఈ శిబిరంలో ఉచిత పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేయడం హర్షణీయమని చెప్పుకొచ్చారు. డాక్టర్ శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరు గుండె జబ్బులతో మరణిస్తున్నారని వెల్లడించారు. దీనికి ప్రధాన కారణాలు పొగాకు వాడకం, మితిమీరిన మద్యపానం వల్ల వచ్చే హాలిడే హార్ట్ సింద్రోమ్, దయాబెటిస్, రక్తపోటు అని వివరించారు. కలర్ డాప్లర్, కాల్షియం స్కోర్ వంటి పరీక్షలతో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లను ముందే 100% కరెక్టుగా గుర్తించవచ్చునని, 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా చెకప్ చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. రమేష్ బాబు, పి. శ్రీనివాస్ చౌదరి, డాక్టర్ ఎం. జయలక్ష్మి, నాయకులు గద్దె రమేష్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, తుమాటి ప్రేమ్ నాథ్, పేరెపి ఈశ్వర్, యలమంచిలి పండు, యలమందలరావు, తాడి బాబూరావు, బండి సాయి కోమలి, గద్దె శ్రీనివాస్, గొల్లపల్లి శంకర్, దాడి సుబ్బారావు, ప్రకాష్ బాబు, గుంజా యేసు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ఎలక్షన్స్ లో గెలిచిన వారిని సన్మానించిన జనసేన నాయకులు అక్కల గాంధీ



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి గర్ల్స్ హై స్కూల్ లో జరిగినటువంటి నాటీజ స్కూల్ ఎలక్షన్స్ లో గెలిచిన చైర్మన్ శ్రీమతి దామెర్ల దివ్య శ్రీ ని, వైస్ చైర్మన్ తమ్మిశెట్టి రామాంజనేయులు ను మంగళవారం జనసేన పార్టీ మైలవరం ఇంచార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ ) దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

## పేదలకు అందుబాటులోకి అధునాతన వైద్య సేవలు

**గుండె వైద్య చికిత్స శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-అధునాతన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా పేదలకు అందిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.మంగళవారం ఉదయం తూర్పు లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా నెల రోజులపాటు నిర్వహించే వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గద్దె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన 25 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకుని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ శిబిరంలో పేదలకు ఉచితంగా గుండె సంబంధిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రముఖ వైద్యులు స్వచ్ఛందంగా ఈ శిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. పేద ప్రజలకు సేవ చేయాలనే ఉన్నత సంకల్పంతో, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గద్దె పేర్కొన్నారు. 2014 వ సంవత్సరం తర్వాత విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, గతంలో చిన్న వర్షానికే ఆసుపత్రి ఆవరణ నీటితో నిండిపోయేదని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్న సమయం నుంచి ఆసుపత్రిని పూర్తిగా పునరుద్ధరించి, సూపర్ స్పెషాలిటీ విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చానని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలు పేదలకు అందుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి రఘునందన్, డిఎంహెచ్ లో శ్రావణ్ బాబు, డెప్యూటీ డిఎంహెచ్ లో ఇందుమతి, డి.సి.హెచ్.ఎస్ మాధవి, వెంకటకృష్ణ, పొట్లూరి రవీంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం.. శాశ్వత భూహక్కులు,

**ఉచిత రిజిస్ట్రేషన్తో పేదలకు ఆస్తిపై పూర్తి హక్కులు.**

**పేదల కోసం అసెంబ్లీలో పోరాడిన ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్ నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో " నేడు పేదలకు పట్టాభిషేకం" కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు క్రమబద్ధీకరణ పట్టాలు అందజేయనున్న స్టేడియం ను ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని పేదల చిరకాల కల నెరవేరబోతోందని ఎమ్మెల్యే ఉమా తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్లలో నివసిస్తున్నప్పటికీ పూర్తి హక్కులు లేని పేదలకు ఉచితంగా ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసి శాశ్వత భూహక్కులు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా పేదలకు తమ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు లభించడంతో పాటు, భవిష్యత్తులో పిల్లల చదువులు, వివాహాలు, వైద్య అవసరాలు వంటి కుటుంబ అవసరాలకు ఆస్తిని ఉపయోగించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. అవసరమైతే బ్యాంకు రుణాలు పొందేందుకు కూడా ఈ ఆస్తి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేదల ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలనే అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, అసెంబ్లీలో కూడా ప్రస్తావించి పేదల తరఫున తాను +. నా 30 ద్వారా నిరంతరం కృషి చేశానని ఉమా తెలిపారు."పేదల సొంతింటి కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని, ఇళ్ల పట్టాలు పేదలకు కేవలం కాగితం కాదు, వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా, తరతరాలకు ఆస్తి హక్కు" అని ఎమ్మెల్యే అన్నారు.పేదల భూహక్కుల కార్యక్రమం ద్వారా తమ జీవితకాల స్వప్నం నెరవేరుతున్నందుకు లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# గళమెత్తిన బెజవాడ న్యాయవాదులు...



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):-బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఒగ్గు గవాస్కర్, సుభాని, పల్లగాని రవిబాబు ల మీద బెజవాడ పోలీసులు అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్న కారణంగా ది బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. అనంతరం శాంతియుతంగా నిరసన తెలుపుతూ అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా బయలుదేరారు. న్యాయవాదుల రక్షణ చట్టం కావాలంటూ భారీ సంఖ్యలో న్యాయవాదులు గళమెత్తి నినాదాలు చేస్తుండగా పోలీసులు కక్షపూరితంగా న్యాయవాదుల నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో బెజవాడ పోలీసులు న్యాయవాదులపై విచక్షణారహితంగా దాడి చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.లక్ష్మీనారాయణ, ఏఎస్ఎస్ రాంప్రసాద్, గిరి, రాజశేఖర్, మహిళా న్యాయవాదులు పి.శ్రీదేవి, సిహెచ్ చైతన్య తదితరుల పట్ల దురుసుగా ప్రవర్తించాడాన్ని, చట్టవ్యతిరేకంగా మహిళా న్యాయవాదుల మీద పురుష పోలీసులు ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసి సభ్య సమాజం తల దించుకునే విధంగా వీధి రౌడీల కంటే దారుణంగా ఖాకీలు తమ దురహంకారాన్ని ప్రదర్శించారని న్యాయవాదులు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి న్యాయవాదులు భారీ సంఖ్యలో చేరుకుని బెజవాడ పోలీసులు, సీపీ డౌన్ డౌన్ అంటూ తీవ్ర స్థాయిలో నినాదాలు చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై పోలీసుల దుశ్చర్యలు ఎక్కువగా పెరిగాయని, న్యాయవాదులపై దాడి చేయడమంటే న్యాయవ్యవస్థ పై దాడి చేయడమేనని రానున్న రోజుల్లో న్యాయవాదుల సత్తా ఏమిటో న్యాయపరంగా పోలీసులకు రుచి చూపిస్తామని న్యాయవాదులు హెచ్చరించారు.

## సరస్ మేళాలో సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



విజయవాడ, సెప్టెంబర్ 29 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి సమక్షంలో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానున్న సరస్ మేళాకు సంబంధించి చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, సందర్శకుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ, సరస్ మేళాకు రోజుకు సుమారు 12 వేల మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సందర్శకులు మేళా ప్రాంగణంలోకి ప్రవేశించే మార్గం, బయటకు వెళ్లే మార్గం వేర్వేరుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. దీనివల్ల రద్దీని నియంత్రించడంతో పాటు సందర్శకులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, మేళాలో ఏర్పాటు చేసే ఫుడ్ స్టాళ్ల వద్ద తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించే నీటి సరఫరాతో పాటు వ్యర్థ జలాల పారుదలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం భూగర్భంలో ప్రత్యేక పైప్‌లైన్లు ఏర్పాటు చేసి, మురుగునీరు నిల్వ ఉండకుండా, దుర్వాసన రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మేళా జరిగే ప్రతి రోజూ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది, వాహనాలు సందర్శకుల రాకపోకలకు అంతరాయం కలిగించకుండా, పారిశుధ్య పనుల కోసం ప్రత్యేక ద్వారం ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మేళా ప్రాంగణంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, సరస్ మేళా నిర్వాహకులు పాల్గొన్నారు.

## కాట్రావులపల్లి జడ్పీ హైస్కూల్ నూతన విద్యా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

**చైర్మన్‌గా తుమ్మ లోవరాజు**



కాకినాడ జిల్లా,జగ్గంపేట, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: జగ్గంపేట మండలం కాట్రావుల్లపల్లి గ్రామంలోని వై.పి.వి.ఎం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా కమిటీని అత్యంత ప్రశాంతంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో పాఠశాల నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా తుమ్మ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా శ్రీమతి కోట దుర్గ భవానీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు పి. లవరాజు, జి. గణేష్, టి. వెంకటరమణ, పి. కాటమరాజు, ఎస్. పల్లవి, ఏ. చిన్నారి, పి. పద్మ, రాజేశ్వరి, రమణమ్మ, దుర్గ దేవి, శ్రీదేవి, వెంకటలక్ష్మి తదితరులు కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అలాగే గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికను విజయవంతం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

## కంది సాగుతో మంచి దిగుబడులు సాధించాలి

**రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సూచనలు**



మాచర్ల రూరల్: సెప్టెంబర్ 29; నేటి శుభోదయ : ప్రత్తి పంట చివరి తీత పూర్తయిన వెంటనే కంది సాగు చేపట్టి రైతులు ఆశాజనకమైన దిగుబడులు సాధించవచ్చని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వి. సత్యగోపాల్ సూచించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి శ్రీమతి పాపకుమారితో కలిసి మండల పరిధిలోని పరిసర గ్రామాల్లో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటలను పరిశీలించి, ఆయా పంటల సాగు పరిస్థితులపై రైతులతో చర్చించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న ప్రత్తి పంటలో చివరి తీత పూర్తయిన వెంటనే కంది పంటను అక్టోబరు చివరి నాటికి విత్తుకోవడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. రెండు, మూడు నీటి తడులు అందుబాటులో ఉన్న పరిస్థితుల్లో కంది పంట నుంచి మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కంది సాగుకు ఎల్ఆర్‌జీ-52, ఎల్ఆర్‌జీ-105, ఎల్ఆర్‌జీ-133-33 రకాలు అనువైనవని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్న ఈ రకాల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తేలిక నేలల్లో వరుసల మధ్య మూడు అడుగుల దూరం, బరువు నేలల్లో నాలుగు అడుగుల దూరం ఉండేలా విత్తుకోవాలని సూచించారు. భూసార పరిరక్షణలో భాగంగా వామ్ జీవ ఎరువును ఎకరానికి ఐదు కిలోల చొప్పున వివిధ ద్రవరూప ఎరువులతో కలిపి చివరి దుక్కిలో వేయాలని తెలిపారు. దీంతో నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి భూసారం మెరుగుపడటంతో పాటు పంట పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మార్కండేయులు, రైతులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణ కోసమే మినీ గోకులాలు

**రైతులకు ఆర్థిక భారం పడకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది**

**పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.11.33 కోట్లతో 529 మినీ గోకులాలు మంజూరు**

**పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.**

**పుట్టపర్తి మండలంలోని పెడబల్లి, బత్తలపల్లి, కోట్లపల్లి, నిడిమామిడి గ్రామాల్లో మినీ గోకులాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



అనంత పురం సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : పశుసంపదను సంరక్షిస్తూ రైతులకు అదనపు ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.11.33 కోట్ల వ్యయంతో 529 మినీ గోకులాలు మంజూరయ్యాయని వారు వెల్లడించారు. ఇందులో భాగంగా పుట్టపర్తి మండలంలోని బత్తలపల్లిలో రైతు ఎల్లయ్య పెడబల్లి లో రైతు దాసరి ఆంజనేయులు కోట్లపల్లి లో రైతు రామసుబ్బారెడ్డి నిడిమామిడి లో రైతు కాయం హరి గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులాలకు మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రైతులు తమ పశువులను వర్షాలు, ఎండలు, ఇతర వాతావరణ పరిస్థితుల నుంచి రక్షించుకునేందుకు మినీ గోకులాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పశువుల సంరక్షణకు అవసరమైన సదుపాయాలను కల్పించడం ద్వారా రైతులకు ఆర్థిక భారం తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పాడి పశువుల పెంపకంతో రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పశుసంపద కీలకమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, పశుసంపద అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. మినీ గోకులాలను రైతులు సద్వినియోగం చేసుకుని పశువులను ఆరోగ్యంగా సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మండల కన్వీనర్ విజయ కుమార్, టీడీపీ మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్ , బొమ్మయ్య,నాయకులు నాగరాజు ,టీడీపీ నాయకులు కార్యకర్తలు, అధికారులు ఏపిడి రమేష్ బాబు, ఏపీఓ వరప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

**214 మంది విద్యార్థుల రక్తదానం.. రక్తదాతలకు పండ్లు, ప్రశంసాపత్రాల పంపిణీ**



మాచర్ల రూరల్: సెప్టెంబర్ 29; నేటి శుభోదయ: అలుగురాజుపల్లి గ్రామంలోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల, గుంటూరుకు చెందిన తలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సహకారంతో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన 214 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల పాస్ట్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్. గోపీచంద్, పాస్ట్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి లయన్ వెంకట సుబ్బయ్య, తలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ ప్రతినిధి శివాజీ పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అండగా నిలిచి ప్రాణాలను కాపాడగలరని వారు పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో పండ్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సంస్థ కార్యదర్శి జున్నా శ్రీనివాసరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ జున్నా చక్రధర్‌రెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి, మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చారి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నరసింహారావు, ఏవో ఖాసిం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, నిర్వాహకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.



## కూటమి ప్రభుత్వం నూతన పెన్షన్లు ఎప్పటి నుంచి అమలు పరుస్తారో స్పష్టంత చెప్పాలన్న శిరసాని ప్రకాష్



విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్) : విస్సన్నపేట వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 28 నెలలుగా కొత్త పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి మనసు రాలేదా అని ప్రశ్నిస్తూ స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు పెన్షన్ల దరఖాస్తుల పేరుతో హడావుడి ఎందుకు చేస్తున్నారని నూతనంగా 13 లక్షలకు పైగా దరఖాస్తులను ప్రజల నుండి తీసుకున్నారని అర్హులైన లబ్ధి దారులకు పెన్షన్లు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పే ధైర్యం లేదా అంటూ కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టిన శిరసాని ప్రకాష్ రాష్ట్రంలో 28 నెలలుగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి కొత్తగా అర్హత పొందిన పేదలకు పెన్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ఇంతకాలం ఎందుకు రాలేదని తిరువూరు నియోజకవర్గం వైసీపీ నేత, ప్రముఖ న్యాయవాది,ఎన్టీఆర్ జిల్లా వైసీపీ లీగల్ టీమ్ కార్యదర్శి శిరసాని ప్రకాష్ ప్రశ్నల వర్షం కురిపించారు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవుతున్న సమయంలోనే కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించడం చూస్తుంటే ఇంతకాలం పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న పేదలు కూటమి ప్రభుత్వానికి ఇప్పుడు మాత్రమే గుర్తొచ్చారా అని ఆయన ఏద్దేవ చేశారు రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పెన్షన్ల కోసం 13 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు ఎప్పటి నుంచి అందిస్తారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు తీసుకోవడం కాదు పెన్షన్ ఇచ్చే తేదీ చెప్పాలని రాజకీయ ప్రయోజనాలకు అవసరాల కోసం పేదలతో చెలగాటం చెయ్యవద్దని ఇలా చేయటం సరికాదన్నారు శిరసాని ప్రకాష్ డిమాండ్ చేశారు. పెన్షన్ ఎప్పుడు ఇస్తారు ఏ నెల నుంచి ఇస్తారు ఎంతమందికి మంజూరు చేస్తారు అనే అంశాన్ని బహిర్గటం చెయ్యాలన్నారు అర్హులైన వారందరికీ పెన్షన్ అందుతుందా లేదా ఈ ప్రశ్నలకు కూటమి ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.

## మాచర్ల గర్ల్స్ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా శివకోటయ్య నాయక్

**ఏకగ్రీవంగా ఎన్నిక.. అభినందించిన బీజేపీ నాయకులు**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 29; నేటి శుభోదయ: మాచర్ల పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ పాఠశాల విద్యా నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్‌గా రమావత్ శివకోటయ్య నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాఠశాల హెచ్ఎం ఉషారాణి ఆధ్వర్యంలో ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులంతా శివకోటయ్య నాయక్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా బలపరిచారు. దీంతో ఆయన ఎస్ఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ మాచర్ల టౌన్ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్, సీనియర్ నాయకుడు పోకూరి కాశీపతి, ఉపాధ్యక్షుడు వరకవి రాజు తదితరులు శివకోటయ్య నాయక్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఎస్ఎంసీ సమన్వయంతో పనిచేయాలని వారు ఆకాంక్షించారు.

## కేజీబీవీ నూతన ఎస్ఎంసీ చైర్మన్‌గా మందా మరియదాసు

**వైస్ చైర్మన్‌గా కుక్కమూడి ప్రమీల ఏకగ్రీవ ఎన్నిక**



దుర్గి, సెప్టెంబరు 29: ఆర్ సి ఇన్చార్జ్;నేటి శుభోదయ : దుర్గి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) నూతన పాలకవర్గ ఎన్నిక మంగళవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్, ఎస్ఎంసీ కన్వీనర్ ఆశాజ్యోతి పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. కమిటీ సభ్యుల మద్దతుతో ఆత్మకూరు గ్రామానికి చెందిన మందా మరియదాసు ఎస్ఎంసీ చైర్మన్‌గా, ముటుకూరు గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రమీల వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులతో ఉపాధ్యాయురాలు పద్మ ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యుల నుంచి సంతకాలు కూడా తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మందా మరియదాసు, వైస్ చైర్మన్ కుక్కమూడి ప్రమీల మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థినులకు మెరుగైన విద్యా, మౌలిక వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుర్గి ఎంఈఓ-1 పి. రమేష్‌బాబు, ఎంఈఓ-2 బెంజిమెన్ హాజరయ్యారు. ఎస్ఎంసీ కమిటీ ప్రాముఖ్యత, విధివిధానాలు, కమిటీ బాధ్యతలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంఈఓలను కూడా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ సర్పంచ్ పేరువాళ ఏసోబు, మాచర్ల మదర్, టీడీపీ నాయకులు బృంగ లింగయ్య, వేణు, మాచర్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందుల విజయ్‌బాబు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్గా మాత ప్రభు ఏకగ్రీవ ఎన్నిక..



కోరుకొండ, సెప్టెంబర్ 29; నేటి శుభోదయం ప్రతినిధి (ఏ.కె);కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్గా యువ నాయకుడు మాతా ప్రభు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కూడా ఎన్నుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో జరిగిన పాఠశాల విద్యార్థుల సమావేశంలో ఈ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. 600..మంది స్టూడెంట్స్ ఉన్న స్కూల్ కి . నూతన చైర్మన్గా ఎన్నికైన వార్తలు మాతా ప్రభు మాట్లాడుతూ..నన్ను ఎన్నుకున్న పేరెంట్స్ విద్యార్థి తల్లిదండ్రులకు నా ఎన్డీఏ కూటమి పెద్దలు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ..రాజనగరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్.. రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి, రాజానగరం నియోజకవర్గశీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బిజెపి కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి కి కృతజ్ఞతలు తెలియజేశారు. అందరీ ఆశీస్సులతో ఎంతో ప్రతిష్టాత్మక జరిగిన ఎస్.ఎం.సి నూతన కమిటీ చైర్మన్గా నన్ను ప్రపోజ్ చేసిన ఎన్డీఏ కూటమి నాయకులందరికీ. పేరు.పేరునా ప్రత్యేకమైన తెలియజేసుకుంటున్నని మాత ప్రభు తెలిపారు.

## చెన్నారెడ్డి హత్యలో పాత్రధారుల అరెస్టు తప్పదు..!

**నాడు ఏకగ్రీవాల పేరుతో లక్షలు దండుకున్నారు..**

**నేడు ప్రజాస్వామ్యం అంటూ శ్రీరంగనీతులు**

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం**



రెంటచింతల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 29 ; నేటి శుభోదయ : వైసీపీ నాయకుడు నవులూరి చెన్నారెడ్డి హత్య కేసులో కీలక పాత్ర పోషించిన వారిని చట్టపరంగా అరెస్టు చేయడం తప్పదని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతల మండల పర్యటనలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చెన్నారెడ్డిని దారుణంగా హత్య చేసి, ఆ నేరాన్ని తనపైకి నెట్టేందుకు అప్పటి వైసీపీ నాయకత్వం, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుట్రలు చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే హతుడి తండ్రి భాస్కర్‌రెడ్డి ఈ పరిణామాలను తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. హత్యకు సంబంధించి దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ తెరవెనుక ఉన్న అంశాలు వెలుగులోకి వస్తాయని, ఈ ఘటనలో పాత్ర ఉన్నట్లు తేలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నేతలు ఏకగ్రీవాల గురించి మాట్లాడటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా' ఉందని జూలకంటి విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిందని ఆరోపించారు. ఏకగ్రీవాల పేరుతో స్థానిక ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రభావితం చేశారని, పదవుల కోసం భారీగా డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. టీడీపీ నాయకులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, వారిపై దాడులు చేయడం, కేసులు పెట్టడం వంటి ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. అప్పట్లో జరిగిన దౌర్జన్యాలను ప్రజలు మరచిపోలేదని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, పార్టీ నాయకులు సుమంత్‌రెడ్డి, మల్లయ్య యాదవ్, హనిమిరెడ్డి, రామకృష్ణ, సర్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బూరుగుపూడి జడ్పీహెచ్ఎస్ ఎస్.ఎం.సి. కమిటీ ఎన్నిక ఏకగ్రీవం..!

**– చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులకు కూటమి నాయకుల అభినందనలు..**



కోరుకొండ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గా బి. రమాదేవి, వైస్ చైర్మన్ టి. ఉమ మల్లేశ్వరి గా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా పూర్తయ్యాయి.విద్యార్థుల సమగ్ర వికాసానికి, పాఠశాల మౌలిక వసతుల కల్పనకు నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కూటమి నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మరియు కూటమి నాయకులు అడపా శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కంటే కేశవరావు, కంటే గణపతి, గండి విజయ్ కుమార్, కట్టా సూరిబాబు, ముని, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## గణాంక శాస్త్రం ఆధునిక విద్య పరిశోధనా రంగాలలో ముఖ్యమైంది.




విజయవాడ, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: గణాంక శాస్త్రం ఆధునిక విద్య మరియు పరిశోధనా రంగాలలో ఎంతో ముఖ్యమైనదని,గణాంక సమాచారాన్ని సులభంగా, వేగంగా మరియు సమర్థవంతంగా విశ్లేషించడానికి వివిధ గణాంక సాఫ్ట్వేర్లు ఉపయోగపడుతున్నాయని వాటిలో జామోవి సాఫ్ట్వేర్ విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులకు సులభంగా ఉపయోగించగల ఒక ముఖ్యమైన గణాంక సాఫ్ట్వేర్ అని పలువురు పేర్కొన్నారు.మంగళవారం శ్రీ దుర్గమల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో జామోవి సాఫ్ట్ వేర్ పై రెండురోజులపాటు హాండ్స్ ఆన్ నేషనల్ వర్క్షాప్ నిర్వహించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఇన్ఛార్జ్ డాక్టర్ పీ.వీ. దుర్గావతి పాల్గొని మాట్లాడుతూ గణాంక శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను, జామోవి సాఫ్ట్వేర్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అడ్వైజర్ టు ప్రిన్సిపల్, హెచ్ ఓ డి ఫిజిక్స్ వై. గీతా మాధురి మాట్లాడుతూ గణాంక శాస్త్రంలోని సిద్ధాంత అంశాలను సాఫ్ట్వేర్ సహాయంతో ఆచరణాత్మకంగా తీసుకురావడానికి గల అంశాలను వివరించారు. ఈ సెషన్ లో స్టాటిస్టిక్స్ హెచ్ ఓ డి అకాడమిక్ ఆఫీసర్ ఏ .ఓ. పి. బి. సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ చక్రవర్తి మాట్లాడుతూ గణాంక శాస్త్రంలోని వివిధ ఉపాధి అవకాశాలను మరియు గణాంక శాస్త్రానికి సాఫ్ట్వేర్ రంగంలోనిశ్రీ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్ . విష్ణు వర్ధన్ , ప్రొఫెసర్ ఇన్ రుద్రవరం డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ , స్కూల్ ఆఫ్ మాథమాటికల్ సైన్సస్ , పాండిచ్చేరి యూనివర్సిటీ రామానూజన్ మాట్లాడుతూ కళాశాలలో జామోవి సాఫ్ట్వేర్ను సంబంధిత అధ్యాపకులకు, విద్యార్థులకు, పరిశోధకులకు మరియు అధ్యాపకులకు వివరిస్తూ, ఎక్సెల్ ద్వారా సి ఎస్ వి ఫైల్ను ఎలా డేటాను ఎగుమతి చేయవచ్చో తెలియజేసి, ఎలా విశ్లేషణ చేసుకోవాలో ఒకే విధముగా ప్రాక్టికల్గా వివరించారు. రెండు రోజుల జామోవి వర్క్షాప్ ద్వారా గణాంక శాస్త్రంలో ఉన్న ప్రాముఖ్యతను తెలియచేశారు. కోడింగ్ చేసే విధానాన్ని ఉపయోగించడం ద్వారా కూడా వివిధ రకాల విశ్లేషణలు నిర్వహించవచ్చని తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో గణాంకశాస్త్ర విభాగాధిపతి, పి మహేశ్వరి అధ్యాపకులు కె . రమ్య , సిహెచ్ . గ్లోరీ , ఎం . రత్న జి . సుమతి స్వరూప మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్త వర్గ నిర్ధారణపై అవగాహన



విజయవాడ, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్త వర్గ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో గుండె ఆరోగ్యం, రక్త వర్గాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్త వర్గాన్ని తెలుసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం బి .స్సీ . హాన్స్ జూలోజి, తృతీయ సంవత్సరం బి .స్సీ . హాన్స్ ఆక్వాకల్చర్ విద్యార్థులు రక్త వర్గ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఏ , బి , ఏబీ , ఓ రక్త వర్గాలతో పాటు ఆర్ హెచ్ పాజిటివ్, ఆర్ హెచ్ నెగెటివ్ రక్త వర్గాలను గుర్తించే విధానాన్ని ప్రాక్టికల్గా ప్రదర్శించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రయోగాత్మకంగా అన్వయించుకున్నారు. రక్తదానం, అత్యవసర సమయాల్లో రక్త వర్గం ప్రాధాన్యత, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఇన్చార్జి డాక్టర్ పి.వి. దుర్గావతి మరియు జంతుశాస్త్ర విభాగాధిపతి డా. ఆర్. రమణి కార్యక్రమాన్ని అభినందించారు. డాక్టర్ ఎ. కల్యాణి, ఐ. అనిత హేమశ్రీ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.“మీ రక్త వర్గాన్ని తెలుసుకోండి -- మీ హృదయాన్ని కాపాడుకోండి, ప్రతి రక్తపు బొట్టు అమూల్యమేనన్నారు. సందేశంతో కార్యక్రమం నిర్వహించారు.

## అక్రమాలకు తావు లేకుండా రైతులు, సభ్యుల సహకారంతో శ్రీరంగపట్నశీ సొసైటీని లాభాల బాటలో నడిపిస్తాశీ.!!’

**– శ్రీరంగపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి**



కోరుకొండ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ప్రతినిధి(ఏ.కె); ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా రైతులు, సభ్యుల సహకారంతో సొసైటీని లాభాల బాటలో నడిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని సొసైటీ చైర్మన్ అడపా వీరబాబు పేర్కొన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సంఘ చైర్మన్ ఆడపా వీరబాబు అధ్యక్షతన, సీఈవో ఆధ్వర్యంలో సొసైటీ సమాచారం, ఆర్థిక లావాదేవీలు సభ్యులకు వెల్లడించారు. సభలో వెల్లడించిన వివరాల ప్రకారం... సంఘంలో మొత్తం ఏ క్లాస్ మెంబర్లు 1409 మంది ఉన్నారు. మెంబర్ల షేర్ ధనం రూ.64,90,771 కాగా, డీసీసీబీలో షేర్లు రూ.1,23,31,000 ఉన్నాయి. అప్పుదారులు 524 మంది ఉన్నారు.జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా తీసుకున్న అప్పులు మొత్తం రూ.8,00,95,126 గా నివేదికలో పేర్కొన్నారు. ఇందులో స్వల్పకాలిక అప్పులు రూ.1,67,32,434, ఎస్టీ అదర్స్ రూ.3,15,32,921, దీర్ఘకాలిక అప్పులు (గు) రూ.76,90,560 తదితరాలు ఉన్నాయి.మెంబర్లకు ఇచ్చిన అప్పులు మొత్తం రూ.9,13,84,583 కాగా, మాజీ సీఈవో ఎం. శ్రీనివాసరావు మిస్ అప్రోప్రియేషన్ అమౌంట్ రూ.2,45,68,465 మినహాయించగా నికర మొత్తం రూ.6,68,16,118 గా ఉంది. దీంతో ఇన్బ్యాలెన్స్ రూ.1,32,79,008 గా నివేదికలో చూపించారు.అలాగే 01-04-2026 నుండి నేటి వరకు ఎరువుల వ్యాపారం ద్వారా సంఘమునకు రూ.1,67,793 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎరువుల కొనుగోలు విలువ రూ.43,08,675 కాగా, అమ్మకం విలువ రూ.42,90,190 గా పేర్కొన్నారు.వసూళ్ల వివరాలను కూడా సభలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి అప్పలరాజు, కోయిరాల వెంకటరమణ, బుద్ధ బాపూజీ, మల్ల అప్పల నరసరావు, గౌర సంఘ జిల్లా అధ్యక్షులు తనకాల వెంకటరమణ, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా లక్ష్మణ్

**వర్కింగ్ ప్రెసిడెంట్గా బత్తుల బాబూరావు**



మాచర్ల, సెప్టెంబర్ 29: ఆర్ సి ఇంచార్జ్; నేటి శుభోదయ : బీసీ సంక్షేమ సంఘం మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా భీమవరపు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్గా బత్తుల బాబూరావు (వకీల్ సాబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా భీమవరపు శ్రీనివాసరావు, మాచర్ల పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పగడాల విజయలక్ష్మిని ఎంపిక చేశారు. మంగళవారం రైల్వే స్టేషన్ రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జింకల నాగేశ్వరరావు నియామకాలను ప్రతిపాదించగా, రాష్ట్ర కార్యదర్శి బృంగా రమణారావు బలపరిచారు. అనంతరం పల్నాడు జిల్లా అధ్యక్షుడు బిళ్లకంటి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు నియామకాలను ఆమోదించారు.ఈ సందర్భంగా బీసీ సంఘం పెద్దలు మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణకు సంఘం నాయకులు, సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బీసీ చట్టం సాధనతో పాటు ఎన్నికల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించే దిశగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు కదం నాగజ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి బాదంభాయి, మాచర్ల మండల అధ్యక్షుడు వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షుడు పోతులూరి పిచ్చయ్య, గోలి శ్రీనివాసరావు, శ్యామసుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-నందివాడ మండలంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే రాము**

**-దండిగానపూడి గ్రామంలో రూ.1.50 కోట్లతో ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే. -సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**




నందివాడ, సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : గుడివాడ నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నందివాడ మండలంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దండిగానపూడి గ్రామంలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారి వ్యవస్థ ఎంతో కీలకమన్నారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. పల్లె పండుగ 3.0లో భాగంగా నియోజకవర్గంలో మొత్తం రూ.8.11 కోట్ల అంచనా వ్యయంతో 18 అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాము అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ, నిర్ణీత ప్రమాణాల మేరకు పనులు పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాటిని ప్రజలు దీర్ఘకాలం వినియోగించుకునేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే రాము తెలిపారు. అదే దిశలో గుడివాడ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళు_న్నామని చెప్పారు.గ్రామాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని, అందుకే గ్రామీణ మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి, గుడివాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమంలో గుడివాడ గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి,ఎంపీడీఓ మల్లేశ్వరి,జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, గుడ్లవల్లేరు మండల టిడిపి అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, టిడిపి నాయకులు గోర్జీ సత్యనారాయణ, ఆర్కెపూడి రామశాస్త్రి, తిరుమలరెడ్డి, సింగాల రాధాకృష్ణ, తోట వెంకటేశ్వరరావు, తోట సాయి గంగరాజు, అట్లూరి స్వరూప్, గోవాద శివ, ముప్పిడి సీతయ్య, పెద్దిరెడ్డి ప్రసాద్, భీమవరపు శ్రీనివాస్, మరగాని శ్రీను, సుబ్రహ్మణ్యం, రూరల్ మండలం నాయకులు గోరుపత్తి సుబ్బారావు, కైలే రంజిత్ కుమార్, తోట సురేష్, దండిగనపూడి గ్రామం నాయకులులి ఊబా నాగరాజు, బి.జగన్, డీసీ సీతయ్య, ఎం . సీతయ్య, జై . అమర్, జాజుల నాగరాజు,పంచాయతీ రాజ్ ఏఇ సూరిబాబు, అధికారులు కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివేకానంద ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

**నైతిక, ఆధ్యాత్మిక విలువలతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

**శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి**

**మాచర్ల, సెప్టెంబర్ 29: ఆర్ సి ఇంచార్జ నేటి శుభోదయ**



స్వామి వివేకానంద ఆశయాలు, బోధనలు, నైతిక మరియు ఆధ్యాత్మిక విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద 164వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాజమండ్రి రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో, శ్రీరామకృష్ణ సేవా సమితి మాచర్ల సౌజన్యంతో ఆదర్శ హైస్కూల్లో విద్యార్థినీ, విద్యార్థులకు జాగృతి పోటీ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద కలలు కన్న నవభారత నిర్మాణం జరగాలంటే విద్యార్థులు చిన్ననాటి నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణ, దేశభక్తితో పాటు భారతీయ సంస్కృతిలోని త్యాగం, సేవా భావాలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ‘వివేకానంద ఫర్ యూత్’ పుస్తకాన్ని ఆధారంగా చేసుకుని నిర్వహించిన ఈ పరీక్షకు ఆదర్శ హైస్కూల్కు చెందిన సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. విద్యార్థుల్లో స్వామి వివేకానంద ఆలోచనలు, దేశభక్తి, సేవా భావం, నైతిక విలువలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.పరీక్షలో ప్రతిభ కనబరిచిన విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ హైస్కూల్ హెచ్ఎం ఝాన్సీ, ఉపాధ్యాయురాలు శ్యాముండేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాచర్ల రాజకీయాల్లో కేశవరెడ్డి పేరు చర్చనీయాంశం

**2024 ఎన్నికల్లో కీలకంగా పనిచేశారంటున్న అనుచరులు..**

**మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్**



మాచర్ల: ఆర్ సి సెప్టెంబర్ 28; నేటి శుభోదయ: మాచర్ల పట్టణ రాజకీయాల్లో యనుముల కేశవరెడ్డి పేరు మరోసారి చర్చకు వస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థుల విజయానికి ఆయన కీలకంగా పనిచేశారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. అప్పట్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో కేశవరెడ్డి చురుకైన పాత్ర పోషించారని వారు చెబుతున్నారు. మాచర్ల పట్టణంలో వివిధ వర్గాలు, కులాలు, మతాలకు చెందిన ప్రజలతో ఆయనకు ఉన్న పరిచయాలు, వ్యక్తిగత సంబంధాలు ఎన్నికల సమయంలో కూటమి శ్రేణులకు ఉపయోగపడ్డాయని అనుచరులు పేర్కొంటున్నారు. పట్టణంలో కూటమికి వచ్చిన మెజార్టీలో ఆయన పాత్ర కూడా ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలవడం, కుటుంబ కార్యక్రమాలకు హాజరై వారితో మమేకం కావడం వంటి సామాజిక కార్యక్రమాల ద్వారా కేశవరెడ్డి ప్రజలకు దగ్గరయ్యారని ఆయన అభిమానులు చెబుతున్నారు. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాలు కూడా పండుగను నిర్వహించుకునేలా విగ్రహాలు, ఆర్థిక సహాయం అందించారని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మాచర్ల పట్టణంలో కేశవరెడ్డికి ఉన్న ప్రజా పరిచయాలు, అనుచర వర్గం, రాజకీయ చురుకుదనాన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పించాలని అభిమానులు కోరుతున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవిని ఆయనకు ఇవ్వడం ద్వారా ఆయనకు గౌరవం కల్పించినట్లవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే మున్సిపల్ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్నది పార్టీ నిర్ణయం, రిజర్వేషన్ తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేశవరెడ్డి పేరు మున్సిపల్ రాజకీయాల్లో వినిపిస్తుండటంతో పట్టణంలో రాజకీయ చర్చకు దారితీస్తోంది. రానున్న రోజుల్లో పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## కంభంపాడు జెడ్పీ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్గా కె. అంజలి

**వైస్ చైర్మన్గా టీ. నాగరాజు ఏకగ్రీవ ఎన్నిక**



మాచర్ల రూరల్, సెప్టెంబర్ 29;నేటి శుభోదయ: కంభంపాడు జెడ్పీ పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) నూతన కమిటీ ఎన్నికలను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జే.సైదమ్మ అధ్యక్షతననిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్గా కె. అంజలి, వైస్ చైర్మన్గా టీ. నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్లకు పాఠశాల సిబ్బంది, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల కల్పన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని పలువురు సభ్యులు వివరించారు.నూతన ఎస్ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, విద్యా ప్రమాణాల పెంపునకు సహకరిస్తామని పేర్కొన్నారు. పాఠశాలకు అవసరమైన అదనపు సౌకర్యాల కోసం సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.



## ఎల్లలు దాటిన మానవత్వం, వైద్యానికి ప్రాంతం లేదు

**– ఆపదలో ఆపద్బాంధవుడు, గాయపడిన యువకుడికి డాక్టర్ రాజశేఖర్ గౌడ్ చేయూత**

**– రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్వయంగా కారులో ఆస్పత్రికి తరలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్**



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: విధి నిర్వహణ ముగించుకుని తిరిగి వెళ్తున్న ఖమ్మం డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చూసి మానవత్వంతో స్పందించిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. కలెక్టరేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్కు చెందిన అభిషేక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.వాటర్ క్యాన్లతో వెళ్తున్న ఆటో ట్రాలీ ప్రమాదానికి గురికావడంతో అభిషేక్ రోడ్డుపై తీవ్ర గాయాలతో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడ గుమిగూడారు. అదే సమయంలో కలెక్టరేట్లో విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ అక్కడి పరిస్థితిని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అప్పటికే అటువైపు నుంచి 108 అంబులెన్స్ వెళ్లినప్పటికీ ప్రమాద బాధితుడిని తరలించకపోవడంతో, పరిస్థితిని గమనించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా గాయపడిన అభిషేక్ను తన కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న అనంతరం బాధితుడి పరిస్థితిని స్వయంగా పరిశీలించగా ఈ ప్రమాదంలో అభిషేక్ కుడి తొడ భాగం విరిగినట్లుగా గుర్తించి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుని, బాధితుడి పరిస్థితిని పర్యవేక్షించారు.ఒక జిల్లా స్థాయి వైద్యాధికారిగా తన విధులకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న ఓ అపరిచితుడిని సొంత మనిషిలా భావించి తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తీరు పలువురి ప్రశంసలు అందుకుంది.పరిచయం లేదు. ప్రాంతం తెలియదు. అయినా ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడాలనే మానవత్వంతో ముందడుగు వేశారు. వైద్యుడిగా తన బాధ్యతను ఆస్పత్రి గోడలకే పరిమితం చేయకుండా, రోడ్డుపైనే ఆచరణలో చూపించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది.“వైద్యానికి ఎల్లలు లేవు, మానవత్వానికి హద్దులు లేవు” అన్న మాటకు డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్పందన ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.



నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక


# రాష్ట్రాన్ని రాతి యుగంలోకి తీసుకెళ్లిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదే

**సీఎం చంద్రబాబు నేతృత్వంలో అప్పుల నుంచి బయటపడుతూ అభివృద్ధి వైపు ఏపీ అడుగులు**

**గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**కొత్తచెరువు మండలం గోరంట్ల పల్లిలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 1కోటి 50 లక్షలతో రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎంపీ పార్థసారథి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.**

అనంత పురం సెప్టెంబర్ 29 నేటి శుభోదయ: రాష్ట్రాన్ని రాతి యుగంలోకి తీసుకెళ్లిన చరిత్ర గత వైసీపీ ప్రభుత్వానిదేనని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంపై సుమారు రూ.5 లక్షల అప్పు భారం మోపిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అప్పుల నుంచి బయటపడుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు మండలం గోరంట్ల పల్లి లో రూ.1కోటి 50 లక్షలతో విబి జి రామ్ జి పథకం ద్వారా సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా రోడ్డు పనులు ,కొత్త చెరువు లో గోకులం షెడ్ పనులకు శంకుస్థాపనలు చేశారు.

### గోరంట్లపల్లి లో రూ.1.50 కోట్లతో ప్రత్యేక రోడ్డులి

వీబీజీ రామ్‌జీ పథకం కింద రూ.1.50 కోట్లతో గోరంట్లపల్లి నుంచి కొత్తచెరువుకు ప్రత్యేక రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే కొత్తచెరువులో గోకులం షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.65 వేల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి, పెట్టుబడి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.త్వరలో పెడబల్లి ప్రాంతంలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, తద్వారా సుమారు 4 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికంగా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గోరంట్లపల్లికి రూ.15 లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం.హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ గోరంట్లపల్లిలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని పనులు చేపడతామని చెప్పారు.వైసీపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, జగన్‌మోహన్ రెడ్డిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.

### కియా కంటే మూడు రెట్లు పెద్ద ప్రాజెక్టు

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి ప్రాంతంలో భారీ పరిశ్రమలు, పెట్టుబడులు రావడం ద్వారా స్థానికంగా యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. కియా కార్ల పరిశ్రమ కంటే మూడు రెట్లు పైగా, సుమారు రూ.లక్ష కోట్లతో పుట్టపర్తి ప్రాంతంలో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు రానుందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా, మౌలిక వసతుల పరంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. గోరంట్ల పల్లి గ్రామం నుంచి కొత్తచెరువుకు వెళ్లే రహదారిలో బ్రిడ్జ్ నిర్మాణానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో త్రాగునీటి సమస్య తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు , రాష్ట్ర డైరెక్టర్ యశోద రాయుడు , వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, పి ఆర్ ఎస్ ఈ మురళి, ఎంపీడీవో నటరాజ్, అధికారులు, టీడీపీ నాయకులు వెంకట నారాయణ ,లావణ్య, భాగ్య ,కాంట్రాక్టర్ పోతులయ్య,శ్రీనివాస్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.






## ఖమ్మం--భద్రాచలం, ఖమ్మం--సత్తుపల్లి మార్గాల్లో డీలక్స్ బస్సు సర్వీస్లకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్ టిసి) ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం--భద్రాచలం, ఖమ్మం--సత్తుపల్లి మార్గాల్లో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను ది.30.09.2026 నుండి అమలు చేస్తుంది. ఖమ్మం - భద్రాచలం డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ.180 /- ఉండగా ఇప్పుడు ఎక్స్ప్రెస్ చార్జ్ రూ.170 /- గా మార్చబడినది. ఖమ్మం - సత్తుపల్లి డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ. 130/- ఉండగా ఇప్పుడు రూ.120/- గా మార్చబడింది. ఈ డీలక్స్ రూట్ మొత్తం అన్ని స్టేజిలలో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వర్తించును. ప్రయాణికులు ఈ మార్పును గమనించి, సంబంధిత డీలక్స్ బస్సు సేవలను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు.

## డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు



: డిపామేజర్ జంగయ్య భద్రాచలం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం--భద్రాచలం మార్గాల్లో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను మాత్రమే వసూలు చేయనున్నారు. ఈ నిర్ణయం బుధవారం నుండి అమలవుతుందని ఆర్ టి సీ భద్రాచలం డిపో మేనేజర్ పి. జంగయ్య తెలిపారు. ఖమ్మం - భద్రాచలం డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ. 180 /- ఉండగా, ఇప్పుడు రూ. 160 /- గా మార్చినట్లు తెలిపారు . ఈ రూట్ లో మొత్తం అన్ని స్టేజీ లలో డీలక్స్ బస్సులకు ఎక్స్ ప్రెస్ చార్జీలు వర్తించునని ఆయన చెప్పారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి, సంబంధిత డీలక్స్ బస్సు సేవలను వినియోగించుకోవాలని పి. జంగయ్య కోరారు.




## విజయవంతంగా రెండు నెలలు పూర్తి చేసుకున్న మధిర 'సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్'

**- 11 మండలాల్లోని 27,700 మంది విద్యార్థులకు రోజూ పోషకాహార అల్పాహారం**

**- సమతుల్య మెనూతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఏకాగ్రత, హాజరు శాతం**

ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్' ప్రోగ్రామ్‌లో భాగంగా మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా రెండు నెలల రన్ను పూర్తి చేసుకుంది. 2026 జూలై 27న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమం, ఆయన నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో నిరంతరాయంగా కొనసాగుతోంది.ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా మధిరతో పాటు సమీపంలోని 11 మండలాల్లో ఉన్న 575 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 27,700 మంది విద్యార్థులకు రోజువారీగా రుచికరమైన, శుభ్రమైన పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో సమతుల్య మెనూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషకాలు అందించేలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నేతృత్వంలో ప్రత్యేక అల్పాహార పట్టికను రూపొందించారు. వారంలో ప్రతిరోజూ వైవిధ్యమైన ఆహారంతో పాటు రోజు విడిచి రోజు వేడి పాలను అందిస్తున్నారు.

### - వారపు అల్పాహార మెనూ

ఒకటవ రోజు ఇడ్లీ -- సాంబార్, రెండో రోజు పూరి -- ఆలూ కుర్మా, మూడో రోజు దోశ -- చట్నీ, నాల్గవ రోజు ఉప్మా -- చట్నీ, ఐదో రోజు మిల్లెట్ ఇడ్లీ -- సాంబార్, ఆరో రోజు బోండా -- చట్నీ అందిస్తున్నారు.

### అత్యాధునిక వంటశాల -- వేగవంతమైన పంపిణీ





అధిక సంఖ్యలో విద్యార్థులకు నిర్ణీత సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించేందుకు ఈ కిచెన్‌లో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గంటకు 5,400 ఇడ్లీలు, 3,600 పూరీలు, 2,000 దోశలు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన అత్యాధునిక వంటశాల కలిగి, ఆధునిక పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసిన అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరవేస్తున్నారు.

### - ప్రభుత్వ వ్యయం వివరాలు

విద్యార్థుల స్థాయిని బట్టి ప్రభుత్వం అల్పాహారానికి అయ్యే వ్యయాన్ని భరిస్తోంది. ప్రాథమిక పాఠశాల (1--5 తరగతులు): రూ. 11.50 (ప్రతి విద్యార్థికి)ఉన్నత పాఠశాల (6--10 తరగతులు): రూ. 13.50 (ప్రతి విద్యార్థికి) జూనియర్ కళాశాల: రూ. 13.50 (ప్రతి విద్యార్థికి) పాలు (రోజు విడిచి రోజు): విద్యార్థికి రూ. 1.08 చొప్పున కేటాయింపు.- సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ కృతజ్ఞతలు ఉదయాన్నే పోషకాహారం అందడం వల్ల విద్యార్థులు ఖాళీ కడుపుతో తరగతుల్లో కూర్చోవాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారి ఏకాగ్రతతో పాటు పాఠశాలల్లో హాజరు శాతం మెరుగవుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ వంటశాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆర్థిక సహాయం అందించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.



# ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**- కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలి**

**- ప్రతి రవాణా వాహనానికి జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు**

**- 7 రకాల సన్నరకం ధాన్యానికే క్వింటాకు రూ.500 అదనపు ప్రోత్సాహకం**

**- మౌళిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి**

**- వర్షం నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి**

**- ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**

ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఖరీఫ్ (వర్షాకాలం) 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నాణ్యత, రవాణా, నిల్వ, మౌళిక వసతులు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని గోదాములకు లేదా గుర్తించిన ఫంక్షన్ హాళ్లకు, రైస్ మిల్లుల్లోని ఖాళీ ప్రదేశాలకు ధాన్యాన్ని తరలించాల్సి ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ముందుగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు.బ్యాంకు గ్యారంటీలు చెల్లించి, గతంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీని పూర్తిచేసిన రైస్ మిల్లులకే భవిష్యత్తులో ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు.రైస్ మిల్లర్ల పాత్ర లేకుండానే ముందుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నందున, ధాన్యం నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఒక రోజులో కొనుగోలు కేంద్రం నుంచి ఎన్ని బస్తాలను రవాణా చేయగలుగుతారో అంత పరిమాణంలోనే ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. రైస్ మిల్లుల మాదిరిగానే ధాన్యం నిల్వ చేసే గోదాముల వద్ద కూడా వేయింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, బరువు పరిశీలించిన అనంతరం ధాన్యాన్ని దించుకోవాలని తెలిపారు.ప్రతి లారీ, ట్రాక్టర్ తదితర ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక యాప్ ద్వారా అన్ని వాహనాల రవాణాను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

### 7 రకాల సన్నరకం ధాన్యానికే రూ.500 అదనపు ప్రోత్సాహకం

ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల ధాన్యాలను బిబిటి 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ ఎంటి సోనా , జై శ్రీరామ్, కేఎన్ఎన్ 1638, డబ్ల్యూజిఎల్ 44, కేఎన్ఎన్ 7715 మాత్రమే సన్నరకంగా పరిగణించి, వాటికి క్వింటాకు అదనంగా రూ.500 ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. ఈ ఏడు రకాల ధాన్యం నమూనాలను ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.గ్రేడ్-'ఏ ' ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441 ధర ఉండగా, గుర్తించిన ఏడు రకాల సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 ప్రోత్సాహకం కలిపి క్వింటాకు రూ.2,961 లభించనున్నట్లు తెలిపారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చిన వెంటనే ధాన్యంలో తేమ శాతం, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో వ్యవసాయ శాఖకు చెందిన ఏఈఓ లేదా ఒక వాలంటీర్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు కూడా సన్నరకం ధాన్యాన్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ బృందం సన్నరకం ధాన్యం రకాన్ని ధృవీకరించాలని తెలిపారు.

### అక్టోబర్ 1 నుంచి 325 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కోసం 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1, 2026 నుంచి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, డిసెంబర్‌లో ధాన్యం రాక మరింత పెరుగుతుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జనవరి వరకు కొనుగోలు కేంద్రాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

- సన్న, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేక ప్రదేశాలు




ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నరకం, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేకంగా ప్రదేశాలను గుర్తించి స్పష్టమైన డిమార్కేషన్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నవంబర్‌లో తుపాన్ల ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజూ ధాన్యంపై టార్పాలిన్ కప్పడం తప్పనిసరిగా చేయాలని అన్నారు.

### మౌళిక వసతులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించవద్దు

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, డిజిటల్ తదితర అవసరమైన మౌళిక వసతులు అందుబాటులో ఉన్న తర్వాతే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించా లని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని 325 కొనుగోలు కేంద్రాలకు అవసరమైన పరికరాల లభ్యతను పరిశీలించి, కొరత ఉన్న పరికరాలను వెంటనే సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.

### - ధాన్యం నాణ్యతా ప్రమాణాలు

ధాన్యం కొనుగోలు సమయంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మట్టి పెడ్డలు, రాళ్లు గరిష్ఠంగా 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారుకాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మిశ్రమం 6 శాతం వరకు ఉండాలని, తేమ శాతం గరిష్ఠంగా 17 శాతం ఉండాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అంతకుముందు కొనుగోళ్లు, లోడింగ్, అన్ లోడింగ్ లపై రూపొందించిన సిపిఎస్ యాప్ అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీసీఓ గంగాధర్, డిఎం సివిల్ సప్లయిస్ మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## గుండాల, బోడు, కొమరారం పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**– సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సకాలంలో నమోదు చేయాలి**

**– సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి**



ఖమ్మం, భద్రాచలం, నేటి శుభోదయ ::: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం గుండాల, బోడు, కొమరారం పోలీస్ స్టేషన్లను సందర్శించి తనిఖీ చేశారు. గుండాల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించి, పోలీస్ స్టేషన్లలో రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.గుండాల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన సందర్భంగా కాంపౌండ్ వాల్, గార్డ్ పోస్ట్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, స్టేషన్ ప్రాపర్టీ భద్రతకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, ఇతర వివరాలను సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై ప్రతి పోలీస్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో బాధ్యతగా వ్యవహరించి, వారికి న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో సీఐలు తిరుపతి, సత్యనారాయణ, ఎస్ఐలు, శ్రవణ్ కుమార్, రాజమౌళి, నాగుల్ మీరా, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఖమ్మం త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిట్టిబాబు



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.చిట్టిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు 5 గ్రామాలు ఎంపి

**రూ.1 కోటి గ్రాంట్ సాధించే అవకాశం**

**పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలి**

**– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 28 నేటి శుభోదయ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పీఎం సూర్య ఘర్ పథకం" ద్వారా ప్రతి జిల్లాలో 5,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలను 'మోడల్ సోలార్ విలేజ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్.ఈ, జెడ్పీ సీఈఓ, డీఆర్డీఏ పిడి, నెడ్క్యాప్ అధికారులు, ఎల్డీఎం, డిపిఓలతో మోడల్ సోలార్ విలేజ్ లలో పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు జిల్లా పరిధిలోని 5 గ్రామాలు నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ గ్రామాలను ఈ పోటీ కోసం ఎంపిక చేశారన్నారు. ఈ రోజు నుండి రాబోయే 3 నెలల పాటు ఈ ఐదు గ్రామాల మధ్య 'సోలార్ కాంపిటీషన్' నిర్వహించబడుతుందని, పోటీ వ్యవధిలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఏ గ్రామంలో అయితే అత్యధికంగా సోలార్ రూఫ్‌టాప్ ఇన్స్టాలేషన్లు ఏర్పాటు చేసుకుంటారో, ఆ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1 కోటి రూపాయిల ప్రోత్సాహక నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఈ గ్రామాలలో రాబోయే 3 నెలల పాటు ఎవరు ఎక్కువ చేస్తారో నివేదిక తెప్పించుకోవాలని, నివేదిక ఆధారంగా ఎంఎన్ఆర్ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెనేవబుల్ ఎనర్జీ) ద్వారా 1 కోటి రూపాయల ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఎంపికైన గ్రామం బిల్లులను దశలవారీగా అప్‌లోడ్ చేయడం ద్వారా ఈ నిధులు విడుదలవుతాయన్నారు. ఈ గ్రాంట్ మొత్తాన్ని గ్రామంలోని ఇతర మౌలిక వసతులు అభివృద్ధి పనుల కోసం ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లకు ఉచిత విద్యుత్ అందడంతో పాటు గ్రామానికి రూ. 1 కోటి అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున, ఎంపిక చేసిన ఐదు గ్రామాల (నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ) ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి శైలజ, నెడ్ క్యాప్ మేనేజర్ కిషోర్, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## ఏదులాపురం 6వ వార్డులో పగిలిన గేట్ వాల్ మూత.

**త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం మున్సిపల్ ఏ.ఈ హామీ**







ఖమ్మం/ఏదులాపురం, సెప్టెంబర్ 29 :ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించారు. టెంపుల్ సిటీ బోర్డు సమీపం, సిమెంట్ రోడ్డు శిలాఫలకం వద్ద, చల్లపల్లి గార్డెన్, సింగరేణి కాలనీ, శ్రీ అభయ టౌన్‌షిప్‌లకు వెళ్లే ప్రధాన మార్గంలో గేట్‌వాల్‌పై ఏర్పాటు చేసిన సిమెంట్ మూత కొద్దిరోజులుగా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది.ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న 'తెలుగు 24 న్యూస్' విలేకరి. ఈ విషయాన్ని మున్సిపల్ ఏ.ఈ. అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఏ.ఈ. అప్పారావు సానుకూలంగా బదులిస్తూ, వెంటనే మున్సిపల్ సిబ్బంది బృందాన్ని అక్కడికి పంపి, పగిలిన సిమెంట్ మూతకు త్వరలోనే మరమ్మతులు చేపట్టి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు రావడం పట్ల స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా, ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

## ఖమ్మం జిల్లాలో నూతన నాయకత్వాన్ని తయారు చేస్తూ యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తున్నాం

**– యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ వెల్లడి**



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, నూతన యువ నాయకత్వాన్ని తయారు చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో గత ఆరు నెలలుగా నిర్వహించిన కార్యకలాపాల నివేదికను యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో వేజండ్ల సాయికుమార్ సమర్పించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయి మాట్లాడుతూ గత ఆరు నెలల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఖమ్మం జిల్లాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పనిచేశామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి గ్రామంలో యువతను భాగస్వాములను చేస్తూ నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని సాయికుమార్ వెల్లడించారు.ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమర్పించిన నివేదికను పరిశీలించిన యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ మరియు తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి వేజండ్ల సాయి ను అభినందించారు.

## అడవి దాటిన ఆకలి !!

## అడవి తల్లి ఒడిని వీడి అనాథలా రోడ్డునపడింది.! .

**చెట్టు కొమ్మల ఊయల మరిచి తారు రోడ్డుపై చేరింది !**



పచ్చని ప్రకృతి పగబట్టిందో...మనుషుల స్వార్థం కాటేసిందో...సహజ ఆహారం కరువైపోయి నడిరోడ్డుపై నిలుచుంది.! పండ్లు, ఫలాలు కోసుకు తినే స్వేచ్ఛా జీవి విలవిలలాడుతోంది..! మనుషులు పడేసే మెతుకుల కోసంచేతులు చాచి య జాలితో పెట్టే తిండి దాని జాతికే ముప్పవుతోంది.! సహజమైన వేటను మరిచి సోమరితనంగా మారుస్తోంది !వాహనాల చక్రాల కిందపడి ఎన్నో జీవులు నలిగిపోతున్నాయి..! అడవిని కాపాడి వాటిని బతకనిద్దాం.! రోడ్ల పై ఆహారం వేయడం ఆపుదాం ! జంతువుల హక్కును గౌరవిద్దాం.! సృష్టి సమతుల్యతను కాపాడుకుందాం! ( ప్రస్తుతం మనం రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు కోతులు రోడ్ల పక్కన, డివైడర్ల పైన గుంపులు గుంపులుగా కూర్చోవడం సర్వసాధారణం అయిపోయింది. అడవులు తగ్గిపోవడం, వాటికి సహజంగా లభించే ఆహార కొరత కారణంగానే ఇవి జనావాసా ల్లోకి, రహదారుల పైకి వస్తున్నాయి.అయితే, ప్రయాణికులు జాలితో వీటికి బిస్కెట్లు, చిరుతిళ్లు, పండ్లు వంటివి అలవాటు చేయడం వల్ల ఇవి తమ సహజమైన ఆహార సేకరణ గుణాన్ని కోల్పోతున్నాయి. మనుషులు ఇచ్చే జంక్ ఫుడ్ వల్ల కోతులు ఊబకాయం, మధుమేహం వంటి రోగాల బారిన పడుతున్నాయి. అంతేకాదు, వాహనాలు వస్తే ఆహారం దొరుకుతుందనే ఆశతో రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. కాబట్టి, వన్యప్రాణుల సహజ జీవన విధానాన్ని దెబ్బతీయకుండా ఉండాలంటే రోడ్ల పక్కన వాటికి ఆహారం వేయడం ఆపాలి. అడవులను రక్షించి, వాటి ఆవాసా ల్లోనే వాటికి ఆహారం దొరికేలా చూడటమే దీనికి నిజమైన పరిష్కారం..! )..... గిరి ప్రసాద్ సోముల, జర్నలిస్ట్ ! 9490063550.

## ఏదులాపురం 6వ వార్డులో పగిలిన గేట్ వాల్ మూత

**– త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం – మున్సిపల్ ఏ.ఈ హామీ**

ఖమ్మం, ఏదులాపురం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించారు. టెంపుల్ సిటీ బోర్డు సమీపం, సిమెంట్ రోడ్డు శిలాఫలకం వద్ద, చల్లపల్లి గార్డెన్, సింగరేణి కాలనీ, శ్రీ అభయ టౌన్‌షిప్‌లకు వెళ్లే ప్రధాన మార్గంలో గేట్‌వాల్‌పై ఏర్పాటు చేసిన సిమెంట్ మూత కొద్దిరోజులుగా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది.ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న 'తెలుగు 24 న్యూస్' విలేకరి. ఈ విషయాన్ని మున్సిపల్ ఏ.ఈ. అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఏ.ఈ. అప్పారావు సానుకూలంగా బదులిస్తూ, వెంటనే మున్సిపల్ సిబ్బంది బృందాన్ని అక్కడికి పంపి, పగిలిన సిమెంట్ మూతకు త్వరలోనే మరమ్మతులు చేపట్టి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు రావడం పట్ల స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా, ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

## యాడికి మోడల్ స్కూల్ చైర్మన్‌గా షేక్ మహమ్మద్ రఫీక్, వైస్ చైర్మన్‌గా షేక్ ఫక్రుణ్ ఎన్నిక



యాడికి, సెప్టెంబర్ 29 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: స్థానిక ఆదర్శ (మోడల్) పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ ఎన్నికల్లో పాఠశాల చైర్మన్‌గా షేక్ మహమ్మద్ రఫీక్, వైస్ చైర్మన్‌గా షేక్ ఫక్రుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో పాఠశాలను అన్ని రంగాల్లోనూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.




## గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటి ఎన్నికలు ఏకగ్రీవం....!



కోరుకొండ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి, పాఠశాల చైర్మన్ గా పెంటపాటి శ్రీనివాసరావు,, వైస్ చైర్మన్ గా శ్రీమతి మద్ద సుహాసిని మరియు మెంబర్ లు మరియు కో అప్టేట్ సభ్యులుగా శ్రీమతి తాడిపల్లి శోభన, శ్రీమతి ఇజ్జిన వరలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గంగాభవాని, మాజీ సర్పంచ్ చిటికెన భాస్కర్ రావు, టిడిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ కొవ్వాడ రాజేంద్రప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు కంచుమర్తి దుర్గాప్రసాద్, చిటికెన గోపాలకృష్ణ, చిటికెన శ్రీనివాస్, మట్ట రామచంద్రరావు, బూరుపూడి సొసైటీ డైరెక్టర్ బాలిన వెంకటేశ్వర్లు జనసేన మండల కన్వీనర్ కాటే కృష్ణ ప్రసాద్, గొర్రెల సుబ్బారావు, గుమ్మడి రవికుమార్ మరియు ఎన్డీయే కూటమి పెద్దలు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సింగరేణి పరిధిలోని సత్తుపల్లి నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక చర్చ

**– రూ.5 కోట్ల నియోజకవర్గ అభివృద్ధి నిధులు విడుదల**



హైదరాబాద్, ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: సింగరేణి సంస్థ పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో సింగరేణికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ సమావేశంలో వివరించారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి చర్చించిన అంశాలపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం విడుదల చేసింది. ఈ నిధులతో నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం కలగనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ , ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి

**: సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జె. రమేష్**




భద్రాచలం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తాయని అన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర విచారణ చేపట్టాలని ఏజే రమేష్ కోరారు. విచారణ ద్వారా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని అన్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తొలగించిన పేర్లపై పూర్తిస్థాయి పరిశీలన చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీపీఐ(ఎం) కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే ఎన్నికల సంఘం తన నిర్ణయాలు చట్టపరమైన ప్రక్రియలోనే జరుగుతున్నాయని, అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉండటం సంస్థాగత ప్రక్రియలో భాగమేనని చెబుతోంది.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, సున్నం గంగా, ఎర్రంశెట్టి వెంకట్రామారావు, డి సీత లక్ష్మి, మచ్చ రామారావు, కొలగాని రమేష్, ఉస్తెల జ్యోతి, కనక శ్రీ పాల్గొన్నారు.

## త్రివేణిలో భగవద్గీత పోటీలు

**రాతపరీక్షలు ప్రారంభించిన ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్**




ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే భగవద్గీత శ్లోక పోటీలను ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. పోటీల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, సీల్డ్ కవర్‌లో ఉన్న ప్రశ్నపత్రాలను విద్యార్థుల ముందే తెరిచి వారికి అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణను పెంపొందించడానికి భగవద్గీత అధ్యయనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే భగవద్గీత శ్లోకాలను అభ్యసించడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఉత్తమ మార్గదర్శకత్వం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ పోటీ నిర్వహణలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ,క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్న ఆర్డిటి

ఆర్ డి టి క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి




తాడిపత్రి, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి యువ క్రీడాకారులను క్రికెటర్లను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న అనంతపురం జిల్లాకు ఆర్డిటి ఒక వరం లాంటిది అని నిత్యం క్రీడారంగ అభివృద్ధి కోసం ఆర్డిటి డైరెక్టర్ మాంచో ఫెర్రర్ విశేషంగా కృషి చేస్తున్నారని ఎందరో రాష్ట్ర స్థాయి జాతీయస్థాయి క్రికెటర్లను తయారు చేయడంలో ఆర్డిటి పాత్ర ఎనలేనిదని తాడిపత్రి మాజీ శాసనసభ్యులు జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. తాడిపత్రి పట్టణంలో ఆర్డిటి ఆధ్వర్యంలో రూరల్ క్రికెట్ టాలెంట్ కార్యక్రమం మంగళవారం జూనియర్ కాలేజ్ మైదానం నందు ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా క్రికెట్ క్రీడాకారుల అన్వేషణలో భాగంగా క్రికెట్ టాలెంట్ హంట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షతన తాడిపత్రి జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెన్ ఆల్ఫా (18 సంవత్సరాల్లోపు యువకులు) పెద్ద ఎత్తున పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదన్నారు. ఒలంపిక్స్, ఆసియా గేమ్స్ లలో మన భారతదేశం పేలవమైన ప్రదర్శన తనను ఎంతగానో బాధిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ డిటి సంస్థ తరహాలో దేశవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి క్రీడా రంగానికి తగిన ప్రోత్సాహం అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతరం ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడాకారుడైన జేసీ ప్రభాకర్ రెడ్డి జిల్లాలో క్రీడాభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తూ వస్తుండడం అభినందనీయమని ఆయన అన్నారు. జేసీ అస్మిత్ రెడ్డి, పవన్ రెడ్డి లతో తనకు చిరకాలంగా మంచి సంబంధాలు ఉన్నాయని క్రీడాకారులకు వివరించారు. ఫెర్రర్ తనపై ఉంచిన బృహత్తర బాధ్యతను శక్తి వంచన లేకుండా విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీనియర్ క్రికెట్ క్రీడాకారులు కందన్ తనవంతుగా చల్లటి తాగునీటిని క్రీడాకారులకు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా ఆర్డిటి క్రికెట్ టాలెంట్ హంట్ ను విజయవంతం చేసిన తాడిపత్రి ఇంచార్జ్ కృష్ణారెడ్డిని పలువురు అభినందించారు. ఏకంగా 300 మంది క్రీడాకారులు టాలెంట్ హంట్ లో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రహీం, సీనియర్ క్రీడాకారులు సుధీర్ రెడ్డి, సాయి వినయ్, పీఈటి హాజీవలి, కుళ్లాయప్ప లతోపాటు పెద్ద సంఖ్యలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



## ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో పోలీస్ ఉద్యోగం సాధ్యమే

పక్కా ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

- ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం

- పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, రైట్ ఛాయిస్ ఉచిత కోచింగ్ శిబిరంలో ప్రత్యేక బోధన



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో నిరంతర సాధన చేస్తే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధ్యమేనని ప్రముఖ హిస్టరీ ఫ్యాకల్టీ, రచయిత డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ శిబిరంలో మంగళవారం ఆయన అభ్యర్థులకు హిస్టరీ ప్రత్యేక తరగతులు నిర్వహించారు.పోటీ పరీక్షల్లో చరిత్రను సులభంగా, సమర్థవంతంగా చదివేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కాలక్రమం, ముఖ్య సంఘటనలు, వాటి కారణాలు, ఫలితాలను అర్థం చేసుకుంటూ చదవాలని సూచించారు. మ్యాప్‌లు, టైమ్‌లైన్‌లను ఉపయోగించుకోవడం ద్వారా అంశాలను సులభంగా గుర్తుంచుకోవచ్చన్నారు. పోలీస్ నియామక పరీక్షల్లో చరిత్ర నుంచి ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో, వాటిని ఎలా విశ్లేషించి సమాధానం ఇవ్వాలో అభ్యర్థులకు వివరించారు.ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు ప్రతిరోజూ పునశ్చరణ, మాక్ టెస్టులు నిర్వహించుకోవాలని సూచించారు. పరీక్షకు చివరి వరకు సమయం వృథా చేయకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తి చేసుకోవాలని తెలిపారు.రైట్ ఛాయిస్ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో సివిల్స్ అభ్యర్థులకు తరగతులు నిర్వహిస్తున్న డాక్టర్ అబ్దుల్ కరీం సార్ ఖమ్మం వచ్చి ప్రత్యేకంగా బోధించడం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీతో శిక్షణ అందించడంతో పాటు అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ ఉన్న నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, వారి ఉద్యోగ సాధనకు ప్రోత్సాహం అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# సైదారావు కు ఘన సన్మానం

- సన్మానం చేసిన మాజీ కార్పొరేటర్



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఇటీవల తెలంగాణ రాష్ట్ర కాపు జేఏసీ ప్రకటించిన నియామకాలలో మున్నూరు కాపు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ గా నియమింపబడిన మదూరి సైదారావు ని మంగళవారం ఖమ్మం నగరంలోని 40వ డివిజన్ లో స్థానిక మాజీ కార్పొరేటర్ దాదే అమృతమ్మ, సతీష్ దంపతులు కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ అమృత సతీష్ దంపతులు కలిసిమాట్లాడుతూ సైదారావు అనే వ్యక్తి మొదటి నుంచి నాయకత్వ పటిమ ఉన్న నాయకుడు ఉత్సాహవంతుడు ఏదైనా చేయాలని పట్టుదల ఉన్న వ్యక్తి మదూరి సైదారావు అలాంటి వ్యక్తి కి ప్రభుత్వం కల్పించిన మున్నూరు కాపు కులానికి రాష్ట్ర కన్వీనర్ గా ఉండటం పెద్ద దిక్కు అలాంటి వ్యక్తికి ఈ పదవి రావడం వల్ల చాలా సంతోషంగా ఉంది అలాగే కాపుల సంక్షేమం అభివృద్ధికి నిదర్శనంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా, మార్కెట్ చైర్మన్, హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వసీం, కుక్కల రామకృష్ణ, గోపి, 40 డివిజన్ కు సంబంధించిన ముఖ్యనాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణే భవిష్యత్తుకు పునాది
## రెజోనేన్స్ ఫ్రెషర్స్ డే వేడుకల్లో డిఐఈఓ రవిబాబు




ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఖమ్మంలోని రెజోనేన్స్ జూనియర్ కళాశాల (ఐఐటి - జేఈఈ, నీట్ అకాడమీ ) ఆధ్వర్యంలో నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు స్థానిక ఎస్ ఆర్ గార్డెన్స్ ఏ/సీ ఫంక్షన్ హాల్లో మంగళవారం అత్యంత ఉత్సాహభరితంగా, వైభవంగా జరిగాయి.కళాశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ రెజోనేన్స్ విద్యా సంస్థల ముఖ్య ఉద్దేశం విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడం మాత్రమే కాకుండా, సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. అకాడమిక్ తో పాటు విద్యార్థుల ఆల్రౌండ్ ప్రతిభకు తమ కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ " విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ కీలకం", విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ముందుగా తమపై తమకు నమ్మకం ఉండాలని తెలిపారు.కో డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఐఐటీ - జేఈఈ, నీట్ లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థులు తమ సీనియర్ల స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవి బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ " విద్యార్థుల జీవితంలో అత్యంత ఉన్నత శిఖరాలను చేరడం అది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణం అని అన్నారు. తల్లిదండ్రులకు విలువని ఇచ్చి తల్లిదండ్రుల కోసం కష్టపడండి, తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకుని రండి, సోషల్ మీడియాకి దూరంగా ఉండండి, " డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి అని అన్నారు. వాటి వల్ల వచ్చే నష్టాలను తెలియజేశారు, గురువుల ప్రాముఖ్యతను వివరిస్తూ, "పాఠాలు చెప్పడమే కాదు. లక్ష్యాన్ని నిర్దేశించి, క్రమశిక్షణను పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని నింపి, ఆశయాలకు ఆకారాన్ని ఇచ్చే వారే గురువులు" అని పేర్కొన్నారు. అలాంటి గురువులను కలిగి ఉన్న రిజోనేన్స్ విద్యార్థులు అదృష్టవంతులని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి అలవాట్లు నేర్చుకొని తమ కుటుంబానికి కళాశాలకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు ఇంటర్ స్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని ఆయన అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రెజోనేన్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారుఈ వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ శ్రీ ఆర్.వి. నాగేంద్ర కుమార్ , శ్రీధర్, నీలిమ, రవి బాబు ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ రవి బాబు, కళాశాల డైరెక్టర్ ఆర్ వి నాగేంద్ర కుమార్, శ్రీధర్, నీలిమ, కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఖమ్మం త్రివేణి లో 6వ తరగతి
## టీ.ఎ1 పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన పునర్వి కాసోజు




ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: ఖమ్మం త్రివేణి పాఠశాలలో 6వ తరగతి ఐ.ఐ.టీ విభాగం ప్రైమ్ సెక్షన్ లో చదువుతున్న కాసోజు పునర్వి పాఠశాల నిర్వహించిన, టీ.ఎ1 పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ పునర్విని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని అన్నారు. పునర్వి టీ.ఎ1 పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించడం ఆమె పట్టుదల, కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలను కేవలం మార్కుల కోసం కాకుండా తమ ప్రతిభను అంచనా వేసుకునే అవకాశంగా భావించాలని సూచించారు. పునర్వి ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ఇంచార్జ్ అశోక్, జూనియర్ ఇంచార్జ్ అనూష, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని పునర్వి ని అభినందించారు.

# చింతూరు లో ట్రాక్టర్ చోరీ



చింతూరు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: చింతూరులోని నిమ్మలగూడెం రోడ్లో నివసిస్తున్న శ్రీను అనే రైతుకు చెందిన ట్రాక్టర్ ( ట్రక్కు తో సహా ) సోమవారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి ఎదురుగా షెడ్ లో పెట్టిన ట్రాక్టర్ ను దొంగలు తస్కరించారు. ఈ మేరకు చింతూరు పోలీస్ స్టేషన్లో బాధితుడు శ్రీను ఫిర్యాదు చేశారు. చింతూరు పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

# తేజవత్ రాము మరణం వైఎస్ఆర్సీపీకి తీరని లోటు మాజీ జెడ్పీటీసీ చిచ్చడి మురళి



చింతూరు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ ::: చింతూరు మండలం, ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ లోని దొంగల జగ్గారం గ్రామానికి చెందిన ప్రముఖ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్సీపీ) నాయకులు తేజవత్ రాము అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటని పలువురు నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాము భౌతికకాయానికి స్థానిక మాజీ జెడ్పీటీసీ చిచ్చడి మురళి తో పాటు పలువురు వైఎస్ఆర్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ తేజవత్ రాము పార్టీ ఆవిర్భావం నుండి నమ్మకమైన కార్యకర్తగా, ప్రజల మనిషిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని గుర్తుచేసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండే ఒక మంచి నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్సీపీ శ్రేణులు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని వేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంతాప కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ మండల కన్వీనర్ వై రామలింగారెడ్డి, మండల నాయకులు కోట్ల కృష్ణ,మాజీ సర్పంచ్ సవలం సత్తిబాబు,మాజీ ఎంపీటీసీ ఎడమ అర్జున్, మాజీ ఉప సర్పంచ్ బి బాబురావు, ధర్మల విప్లవ కుమార్ ,స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాముకు నివాళులర్పించారు.

# విద్యార్థులు బాగా చదవాలి
# ఎం పి అంబికా లక్ష్మీనారాయణ




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 29 నేటి శుభోదయ : యువత భవితకు భరోసా కార్యక్రమంలో భాగంగా కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎం పి అంబికా లక్ష్మీనారాయణ కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూవిద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి ఆలోచనలను ఉన్నత లక్ష్యాల వైపు మళ్లించడమే యువత భవితకు భరోసా కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, కలలను విద్యార్థులు సాకారం చేసి, గ్రామం నుంచి దేశం వరకు కళ్యాణదుర్గం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించాను.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో విద్యార్థుల కు సుమారు 500 సైకిల్స్ పంపిణీ చేయడం జరిగింది.ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి.కళ్యాణదుర్గం ప్రాంత అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే సురేంద్ర చేస్తున్న కృషిని అభినందించాను. ముఖ్యంగా ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు అభినందనలు తెలియజేశాను.అలాగే స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు తాగునీటి అవసరాల కోసం వాటర్ ప్లాంట్ మంజూరుకు చర్యలు తీసుకున్నాము. వడ్డే కుల సంఘం కమిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించేందుకు కృషి చేస్తామని, కళ్యాణదుర్గం పట్టణంలో క్లాక్ టవర్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేశాను.ఈ సందర్భంగా కళాశాలకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు సాధించడంలో కృషి చేసిన ఎన్ఎస్ఎస్ అధికారి ని ఎమ్మెల్యే తో కలిసి అభినందించాము.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మీదేవమ్మ , మండల కన్వీనర్ వెంకటేష్ , ఇరిగేషన్ డైరెక్టర్ లోకేష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. మన యువతే మన భవిష్యత్తు. వారి కలలకు, వారి లక్ష్యాలకు మన ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎం పి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.



## కుట్టు మిషన్ లను పంపిణీ చేసిన డాక్టర్ తుమ్మల యుగంధర్

ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :: 19వ డివిజన్ లో జరిగిన జన శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో కుట్టు మిషను పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ మహిళలకు కుట్టు మిషన్ లను పంపిణీ చేశారు. అనంతరం టైలరింగ్,బ్యూటిషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లును అందించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సోదరీమణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు , వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తుపాకుల యలగొండ స్వామి,కమర్తపు మురళీ , ఝాన్సీ,కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం

అర్హులైన పట్టభద్రులు వెంటనే నమోదు చేసుకోవాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2027 మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల (మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్, వరంగల్ - ఖమ్మం - నల్గొండ నియోజకవర్గాల) నేపథ్యంలో ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు.వచ్చే నెల నవంబరు 6వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని, ఈ ఏడాది నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదుకు అర్హులని పేర్కొన్నారు.పట్టభద్రులైన యువత, ఉద్యోగులు, విద్యావంతులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే జాబితాలో పేరు ఉన్నవారు సైతం కొత్తగా ఫారం-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ (సి ఈఓ తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా) నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాధ్యతగా తీసుకొని గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులకు అవగాహన కల్పించాలని, ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు.

